విశాఖపట్టణం
శుక్రవారం 31 అక్టోబర్ 2025

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.in సంపుటి: 8 సంచిక: 271 వెల: రూ.5/- పేజీలు: 12

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



## బాలిక గల్లంతు

కాలుజారి
గడ్డలో పడిన ధనుశ్రీ
ఆచూకీ కోసం గాలింపు
పద్మనాభంలో ఘటన

2


తప్పుగా మాట్లాడా..

## క్షమాపణలు చెప్తున్నా

భగవద్గీత తలరాత మార్చదన్న మాటలు సరికాదు
మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వివరణ



# జాబ్స్ గేట్ వే.. నైపుణ్యం



20 లక్షల ఉద్యోగాలు సాకారం చేస్తాం
ప్రతీ నెలా నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు
శిక్షణ పొందిన వారికి ధృవీకరణ పత్రాలు
సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
నైపుణ్యాభివృద్ధిపై లోకేశ్‌తో కలసి సమీక్ష

(అమరావతి, జయజయహే)

యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూనే, వారి ఉన్నత విద్యకు సహకరించేలా ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే వారి కోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్ ఉద్యోగాల గేట్ వేగా ఉండాలని అధికారులకు సూచించారు. 2029 కల్లా 20 లక్షలు ఉద్యోగాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇకపై ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించాలని అధికారులను సీఎం ఆదేశించారు. నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సులోగా 'నైపుణ్యం' పోర్టల్ ప్రారంభించి, అందుబాటులోకి తీసుకురావాలని సీఎం సూచించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన వారికి ఇక నుంచి అధికారికంగా ధ్రువపత్రాలు

..మిగతా 2లో



# బాబు వల్లే తుపాను నష్టం

రైతులకు ప్రభుత్వ సాయం అందడం లేదు
పంటల బీమాను టీడీపీ ఎగ్గొట్టేసింది
అప్పట్లో మేము బీమా కల్పనతో రైతులకు మేలు
వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలు
జిల్లాల నేతలతో వీడియో కాన్ఫరెన్స్

(తాడేపల్లి, జయజయహే)

తుపాను మొంథా చంద్రబాబు తెచ్చిన విపత్తు అని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. బుధవారం బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చిన ఆయన గురువారం పార్టీ నేతలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ముఖ్యంగా వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పైరు పొట్ట

..మిగతా 3లో



చాబహార్ పోర్ట్..

## భారత్‌కు ఊరట

అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపు

2

బురద నీటిలో..

## పంట పొలంలో..




తుపాను బాధితులకు పవన్ పరామర్శ
అన్ని విధాలుగా ఆదుకుంటామని అభయం
ముందస్తు చర్యలతో నష్టాన్ని బాగా తగ్గించాం
డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు
కృష్ణా జిల్లాలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

(కృష్ణా జిల్లా, జయజయహే)

మొంథా తుపాను వల్ల రాష్ట్రంలో కలిగే నష్టాన్ని ముందస్తు చర్యలతో చాలా వరకు తగ్గించామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సీఎం చంద్రబాబు ముందు చూపు కారణంగా చాలా జాగ్రత్తలు

..మిగతా 3లో



## ఇక వైవీ సుబ్బారెడ్డికి పిలుపు?

కల్తీ నెయ్యి కేసులో సిట్ దూకుడు
వైవీ పీఏ అప్పన్నను అరెస్ట్ చేసిన సిట్
తొలిసారి రాజకీయ నేపథ్యం వ్యక్తి అరెస్టు
తదుపరి ఉచ్చు సుబ్బారెడ్డికేనని ఊహాగానాలు

2

తుపాను నష్టం

## రూ.5265 కోట్లు



ప్రాథమికంగా ప్రభుత్వ అంచనా
వ్యవసాయరంగానికి రూ.829 కోట్లు
హార్టికల్చర్‌కు రూ.39 కోట్లు
మత్స్యరంగానికి రూ.1,270 కోట్లు
ఆర్‌అండ్‌బీకి రూ.2,079 కోట్లు
నీటిపారుదలశాఖకు రూ.207 కోట్లు

3



## జోగి చుట్టూ ఉచ్చు!

నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం

(అమరావతి, జయజయహే)

ఇబ్రహీంపట్నం కల్తీ మద్యం కేసులో వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌కు ఉచ్చు బిగుస్తోంది. జోగి రమేష్ చెప్తేనే నకిలీ మద్యం తయారు చేశానని సిట్ అధికారుల విచారణలో ప్రధాన నిందితుడు

..మిగతా 2లో

కరూర్ ఘటన తరవాత

# మళ్లీ ప్రజల్లోకి విజయ్

పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్న నేత



ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

కరూర్ రోడ్‌షోలో 41 మంది దుర్మరణం సంఘటన తర్వాత పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్న తమిళగ వెట్రి కళగం నేత విజయ్ మళ్లీ పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇటీవల కరూర్ మృతుల కుటుంబ సభ్యులను మహాబలిపురం రిసార్ట్‌కు రప్పించి వారికి క్షమాపణ చెప్పి, గాయపడిన వారికి తలా రూ.2లక్షలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన తర్వాతే ఆయన ధాన్యం కొనుగోలు వ్యవహారంపై డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సుదీర్ఘ ప్రకటన చేశారు. బుధవారం సాయంత్రం పార్టీ సీనియర్ నేతలతో సమావేశమై 28 మంది సభ్యులతో

..మిగతా 2లో

# 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్



ఆమోదం తెలిపిన రాష్ట్రపతి ముర్ము
నోటిఫికేషన్ వెలువరించిన న్యాయశాఖ


ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి అవసరమైన ప్రక్రియ పూర్తయ్యింది. సీజేఐగా జస్టిస్ సూర్య కాంత్ నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో సుప్రీంకోర్టు 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

..మిగతా 2లో

# ఇక వైవీ సుబ్బారెడ్డికి పిలుపు?

(తిరుమల - జయజయహే)



తిరుమల శ్రీనివాసుడి లడ్డూ ప్రసాదంలో వాడేందుకు కల్తీ నెయ్యి సరఫరా అయ్యిందనే కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బుధవారం జరిగిన అరెస్టుతో ఇందులో కీలక వ్యక్తులను కూడా విచారిస్తారనే ప్రచారం జోరందుకుంది. అరెస్టు అయిన వ్యక్తి టీటీడీ మాజీ ఛైర్మన్‌కు మాజీ పీఏ అరెస్టు కావడంతో ఈ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందనే ఆసక్తి అందరిలో నెలకొంది. వైసీపీ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి కల్తీ నెయ్యి సరఫరా అయ్యిందని అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకుంది. కోర్టు ఆదేశాల మేరకు సిట్ ఏర్పాటు చేశారు. ఈ దర్యాప్తు బృందం ఇప్పటికే పలు కంపెనీలకు చెందిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించింది. ఇన్ని రోజులు సైలెంట్‌గా విచారణ సాగుతున్న కేసు ఇప్పుడు మరో మలుపు తిరిగింది. ఇప్పటి వరకు రాజకీయాలకు నేరుగా సంబంధం లేని వ్యక్తులను మాత్రమే అరెస్టు చేసి విచారించారు. ఇప్పుడు తొలిసారిగా రాజకీయాలతో సంబంధం ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

టీటీడీ మాజీ ఛైర్మన్, రాజ్యసభ ఎంపీ, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వద్ద పీఏగా పని చేసిన అప్పన్నను సిటి బృందం బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుంది. విజయనగరానికి చెందిన అప్పన్న వైవీ సుబ్బారెడ్డి వద్ద 2014 నుంచి 2024 వరకు పీఏగా పని చేశారు. ఆయనే ఢిల్లీలో ఏపీ భవన్‌లో ప్రోటోకాల్ ఓఎస్డీగా కూడా విధులు నిర్వర్తించారు. వైసీపీ వ్యవహారాలు చక్కబెట్టిన వ్యక్తిని ఇప్పుడు కల్తీ నెయ్యి కేసులో అరెస్టు చేయడం సంచలనంగా మారింది. అప్పన్నను ఇప్పటికే సిట్ అధికారులు రెండుసార్లు విచారించారు. ఆ విచారణలో ఆయన సమాధానాలు సరిగా చెప్పలేదని అధికారులు చెబుతున్నారు. మరోసారి విచారణకు పిలుస్తారనే క్రమంలో అప్పన్న హైకోర్టును ఆశ్రయించి సిట్ విచారణపై స్టే తెచ్చుకున్నారు. అయితే దీనిపై సిట్ అధికారులు సుప్రీంకోర్టుకు వెళ్లి విచారణ సాగేలా వాదనలు వినిపించారు. కోర్టు సిట్‌కు అనుకూలంగా నిర్ణయం వెల్లడించింది. దీంతో విచారణ తిరిగి ప్రారంభించిన అధికారులు రెండు రోజుల నుంచి అప్పన్నను తిరుపతిలో ప్రశ్నిస్తున్నారు. ఆయన సరిగా సమాధానం చెప్పడం లేదని రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

**నెక్ట్స్ టార్గెట్ సుబ్బారెడ్డియేనా?**

సుబ్బారెడ్డితో నేరుగా సంబంధం ఉన్న వ్యక్తిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో తర్వాత ఏం జరగబోతోందనే ఆసక్తి నెలకొంది. సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడే తిరుమలకు మూడు కంపెనీల నుంచి కల్తీ నెయ్యి సరఫరా అయ్యిందని సిట్ ఆరోపిస్తోంది. ఇప్పటికే ఆయా కంపెనీల ప్రతినిధులను విచారించారు. ఇప్పుడు అప్పన్నను కూడా కస్టడీకి తీసుకొని విచారిస్తారు. దీంతో ఆయన చెప్పే విషయాలు ఆధారంగా సుబ్బారెడ్డిని కూడా విచారిస్తారా అనే అనుమానం అందరిలో ఉంది. ముందు అప్పన్నను కస్టడీలోకి తీసుకున్న తర్వాత కీలక పరిణాలు జరుగుతాయని అంటున్నారు.



# 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

మొదటి పేజీ తరువాయి...

నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. నవంబరు 24న సీజేఐగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేయనున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టబోతున్న తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ నిలవనున్నారు. జస్టిస్ సూర్యకాంత్‌కు అభినందలు తెలుపుతూ కేంద్ర న్యాయమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'భారత రాజ్యాంగ ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించేందుకు రాష్ట్రపతి సంతోషంగా ఉన్నారు. ఆయన నవంబర్ 24 నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు' అని పోస్టులో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఉన్న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. 1962 ఫిబ్రవరి 10న హరియాణా హిస్సార్ జిల్లాలోని మధ్యతరగతి కుటుంబంలో జస్టిస్ సూర్యకాంత్ జన్మించారు. 1981లో అక్కడి ప్రభుత్వ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1984లో రోహ్తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయ శాస్త్ర పట్టా పొందారు. అదే ఏడాది హిస్సార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా సాధన ప్రారంభించిన ఆయన 1985లో పంజాబ్ హరియాణా హైకోర్టుకు మారారు. 2001లో సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్ హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019లో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అలాగే 2024 నవంబరు 12 నుంచి సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు.

**కీలక తీర్పుల్లో భాగస్వామి**

దాదాపు రెండు దశాబ్దాల పాటు సేవలు అందించిన జస్టిస్ సూర్యకాంత్ కీలక తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ సభ్యుడిగా ఉన్నారు. బ్రిటీష్ కాలం నాటి దేశద్రోహ చట్టాన్ని నిలిపివేస్తూ ఇచ్చిన తీర్పులో భాగస్వామిగా ఉన్న ఆయన ఈ చట్టం కింద కొత్తగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయవద్దని తీర్పులో ఆదేశించారు. వాక్‌స్వాతంత్ర్యం, అవినీతి, బిహార్ ఓటర్ల జాబితా, పర్యావరణం, లింగసమానత్వం వంటి అంశాల్లో ఆయన కీలక తీర్పులను వెలువరించారు. బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా ఈసీ తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను వెల్లడించాలని ఆదేశించిందిన ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. సుప్రీంకోర్టుతో పాటు అన్ని కోర్టుల బార్ అసోసియేషన్లలో మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని ఆయన ఆదేశించారు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ పథకాన్ని ఆయన సమర్థిస్తూ, అది రాజ్యాంగపరంగా చెల్లుబాటు అవుతుందని తీర్పును ఇచ్చారు. ప్రస్తుతం శాశ్వత సర్వీసుల్లో మహిళా అధికారులను నియమించే పిటిషన్‌పైనా వాదనలను ఆయన వింటున్నారు. అలాగే 1976 అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ మైనారటీ హోదాను పునఃసమీక్షించేందుకు మార్గాన్ని సుగమం చేస్తూ తీర్పు ఇచ్చిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. పెగాసస్‌పై విచారణ జరిపిన కేసులోనూ సూర్యకాంత్ భాగస్వామిగా ఉన్నారు. రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లుల ఆమోదంపై దాఖలైన పిటిషన్ల విచారణ ధర్మాసనంలో ఆయన ఉన్నారు. 2022లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో జరిగిన భద్రతా లోపంపై దర్యాప్తు చేసేందుకు నియమించిన కమిటీలో జస్టిస్ సూర్యకాంత్ కూడా ఉన్నారు.

# తప్పుగా మాట్లాడా.. క్షమాపణలు చెప్తున్నా

## భగవద్గీత తలరాత మార్చదన్న మాటలు సరికాదు

## మడకశిర ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు వివరణ

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు, మడకశిర టీడీపీ ఎమ్మెల్యే మీ.ఎస్.రాజు 'భగవద్గీత', 'బైబిల్', 'ఖురాన్' వంటి మత గ్రంథాలు రాజ్యాంగం కన్నా గొప్పవేం కాదని అన్నారు. మత గ్రంథాలు దళితుల జీవితాల్లో మార్పు తీసుకురాలేదని, డా.బీ.ఆర్. అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం వల్లే దళితుల బతుకులు మారాయని రాజు .. కార్యక్రమంలో చెప్పారు. "భగవద్గీత, బైబిల్, ఖురాన్ వంటి మత గ్రంథాలు దళితుల బతుకులు మార్చలేదు. కేవలం అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే దళితుల తలరాతలు మారాయి. మత గ్రంథాలు కాదు, రాజ్యాంగం మాత్రమే మా జీవితాల్లో మార్పు తీసుకువచ్చింది." అని ప్రసంగించారు. మూడు మత గ్రంథాల గురించి ఎంఎస్ రాజు చెప్పినప్పటికీ టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉండి.. భగద్గీత జీవితాల్లో మార్పు తీసుకురాదని చెప్పడంపై హిందూ సంస్థలు, రాజకీయ వర్గాలు తీవ్రంగా మండిపడ్డాయి. టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి కూడా రాజును తీవ్రంగా ఆరోపించి, 'క్షమాపణలు చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వగానే వివాదం రగిలింది. హిందూ సంస్థలు దీన్ని 'సనాతన ధర్మానికి అవమానం'గా చూస్తూ, రాజు టీడీపీ నుంచి బహిష్కరణ, టీటీడీ బోర్డు నుంచి తొలగింపు డిమాండ్ చేశాయి. ఈ వివాదంపై ఎంఎస్ రాజు ప్రతిస్పందించారు. తాను దళిత హిందువునని భూమన కరుణాకర్ రెడ్డిలా కాదన్నారు. నా కుటుంబం మొత్తం హిందూ. భగవద్గీత లేదా ఇతర మత గ్రంథాలను అవమానించలేదు. అంబేద్కర్ రాజ్యాంగం గొప్పతనాన్ని ప్రశంసించానన్నారు. మొంథా తుపాను రిలీఫ్‌పై ప్రభుత్వం చేస్తున్న పనులను డైవర్ట్ చేయడానికి తన వ్యాఖ్యలను వివాదాస్పదం చేస్తున్నారని అన్నారు. హిందవుల మనోభావాలు గాయపడితే..ఒక హిందువుగా క్షమాపణలు చెబుతాను." అని ప్రకటించారు. "రాష్ట్రంలో 5,000 ఆలయాలు నిర్మించాలని ప్రతిపాదించాను, మడకశిరలో ఆలయ కార్యక్రమాలు నిర్వహించాను" అని ఎంఎస్ రాజు గుర్తు చేశారు. ఎంఎస్ రాజు క్షమాపణలు చెప్పడంతో వివాదం ముగిసినట్లయింది.


# జాబ్స్ గేట్ వే.. నైపుణ్యం

మొదటి పేజీ తరువాయి...

జారీ చేయాలన్నారు. గురువారం సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. నైపుణ్యం పోర్టల్, జాబ్ డ్యాష్ బోర్డ్, వివిధ కోర్సులు, ఉద్యోగావకాశాలు తదితర అంశాల గురించి సమీక్షలో చర్చించారు.


**క్లస్టర్ల ఆధారంగా నైపుణ్య శిక్షణ : లోకేష్**

క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ ద్వారా నైపుణ్యాలను పెంచేలా ప్రయత్నిస్తున్నామని%ొ% స్పేస్, ఆక్వా, క్వాంటం లాంటి రంగాల్లో సంస్థలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ చేపట్టినట్టు మంత్రి లోకేష్ ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తం 15 క్లస్టర్ల ద్వారా పరిశ్రమలకు మానవ వనరుల్ని అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని సీఎంకు వివరించారు. ఈ విధానంపై ఆస్ట్రేలియాలో అధ్యయనం చేసి అమలు చేస్తున్నామన్నారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు ఎక్కడ లభిస్తున్నాయో అందరికీ తెలిసేలా నైపుణ్య పోర్టల్ అభివృద్ధి చేయడమే కాకుండా%ొ% నైపుణ్య కల్పనలో దేశ, విదేశాలకు చెందిన సంస్థలను సంప్రదించాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. విశ్వవిద్యాలయాలు, జాతీయ-అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి పొందకుండా నిరుద్యోగులుగా ఉన్నవారికి ప్రయోజనం చేకూర్చేలా నైపుణ్యం పోర్టల్ తీర్చిద్దాలన్నారు. అభ్యర్థులు ఏ రంగంలో తమకు ఉద్యోగం, ఉపాధి కావాలని కోరుకుంటున్నారో%ొ% ఆ అవకాశాన్ని పొందేలే వివరాలు పోర్టల్‌లో పొందుపరచాలని సీఎం సూచించారు.



**అన్ని శాఖలు, విభాగాల డేటా అనుసంధానం**

ఇప్పటివరకు రాష్ట్రంలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,44,000 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నైపుణ్యం పోర్టల్ నుంచి ఏఐ ద్వారా అభ్యర్థులు తమ రెజ్యూమ్ రూపొందించుకునే వెసులుబాటు కల్పించినట్టు వెల్లడించారు. వాట్సప్ ద్వారా ఉద్యోగావకాశాల గురించి సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అన్ని శాఖలు, విభాగాల డేటా బేస్ సమీకృతం చేసి నిజమైన నిరుద్యోగులను గుర్తిస్తున్నామని అధికారులు వివరించారు. ఎక్కడ, ఏ రంగంలో శిక్షణ అందిస్తున్నాం, జాబ్ మేళాలు ఏ ప్రాంతంలో నిర్వహిస్తున్నాం, ఏయే సంస్థల్లో ఎలాంటి ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనే దానిపై పోర్టల్ నుంచి అభ్యర్థులకు సమాచారం అందేలా తీర్చిదిద్దామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఉద్యోగార్థులు ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యేలా ఏఐ సిమ్యులేటర్ సైతం నైపుణ్యం పోర్టల్‌లో అందుబాటులో ఉందన్నారు.



# చాబహార్ పోర్ట్.. భారత్‌కు ఊరట

## అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపు

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

ఇరాన్‌లోని చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట లభించింది. వచ్చే ఏడాది ప్రారంభం వరకు అమెరికా ఆంక్షల నుంచి దీనికి మినహాయింపు దొరికింది. అమెరికా గతంలో ఇచ్చిన మినహాయింపునకు నేటితో గడువు ముగిసిన నేపథ్యంలో మళ్లీ ఈ గడువు పొడిగింపు వచ్చింది. దీంతో చాబహార్ పోర్ట్‌లోని షహీద్ బెహెస్తీ టెర్మినల్ అభివృద్ధి, నిర్వహణకు భారత్‌కు వీలు కలిగింది చాబహార్ పోర్టుపై ఆరు నెలల పాటు ఈ ఆంక్షల మినహాయింపు ఉందని భారత ప్రభుత్వం ధ్రువీకరించింది. మధ్య ఆసియా దేశాలతో భారత్ వాణిజ్యం నెరపడానికి చాబహార్ పోర్టు ప్రధాన మార్గంగా ఉంది. ఈ పోర్టు అభివృద్ధి, నిర్వహణలో భారత్‌దే కీలక పాత్ర. ఇప్పటికే న్యూదిల్లీ ఈ ప్రాజెక్టులో భారీగా పెట్టుబడులు పెట్టింది. కజఖిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజికిస్థాన్, తుర్క్‌మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్ వంటి దేశాలకు భారత్ ఇక్కడినుంచి సరకు రవాణా చేయవచ్చు. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా అఫ్గానిస్థాన్‌కు భారత్ అందించే ఆహార ధాన్యాలను కూడా ఈ మార్గంలోనే పంపిస్తున్నారు. ఇదిలాఉంటే.. ఈ ఓడరేవులో 10ఏళ్ల పాటు టెర్మినల్ నిర్వహణ కోసం గత ఏడాది భారత్-ఇరాన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది.ఈ ఒప్పందం తర్వాత భారత్‌కు అమెరికా హెచ్చరికలు చేసింది. "ఇరాన్‌పై అమెరికా కొన్ని ఆంక్షలు విధించింది. వాటి అమలు కొనసాగుతూనే ఉంటుంది. ఏ సంస్థ అయినా, దేశమైనా టెహ్రాన్‌తో వ్యాపార లావాదేవీలు జరిపితే.. వారు కూడా వాటి పరిధిలోకి వస్తారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి" అని వ్యాఖ్యానించింది. ఆ ఒప్పందాన్ని సంకుచిత దృష్టితో చూడకూడదని అప్పట్లో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కౌంటర్ ఇచ్చారు.

# కరూర్ ఘటన తరవాత మళ్లీ ప్రజల్లోకి విజయ్

మొదటి పేజీ తరువాయి...

కొత్త కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా సాగించాలని ఆయన నిర్ణయించారు. ఆ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అధ్యక్షతన పనయూరులోని పార్టీ కార్యాలయంలో కొత్త కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ నిర్వాహక కమిటీ తొలిసమావేశం సాఫీగా సాగిందని, మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా కొనసాగించాలని పార్టీ నాయకులంతా సూచించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. కరూర్ దుర్ఘటన పార్టీ వ్యవహారాలను పూర్తిగా స్తంభింపజేసిందని, ఆ శోకం నుండి పూర్తిగా బయటపడి పార్టీ నాయకుడు విజయ్ మళ్ళీ చురుకుగా పార్టీపై దృష్టిసారిస్తున్నారన్నారు. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంటారా? అని విలేఖరుల ప్రశ్నించగా, నెల రోజులకు ముందు పార్టీ ఏ స్థితిలో ఉండేదో ఆ స్థితిలోనే పార్టీ వ్యవహారాలు కొనసాగుతాయని ఆ పార్టీతో పొత్తు లేనట్లేనని సూచన ప్రాయంగా నిర్మల్‌కుమార్ తెలియజేశారు.

# బాలిక గల్లంతు

## కాలుజారి గడ్డలో పడిన ధనుశ్రీ

## ఆచూకీ కోసం గాలింపు

## పద్మనాభంలో ఘటన

(విశాఖపట్నం, జయజయహే)

విశాఖ జిల్లా పద్మనాభం మండలం తునిపాలం గెడ్డలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. తండ్రికి సాయం చేసేందుకు వెళ్లిన కూతురు గల్లంతు అయ్యింది. కాలుజారి ప్రమాదవశాత్తు గడ్డలో జారీపడిన బాలిక ధనుశ్రీ మునిగిపోయింది. రంగంలోకి దిగిన పోలీసులు రెవిన్యూ సిబ్బంది సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. ధనుశ్రీ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. విశాఖ జిల్లా పద్మనాభం మండలం తునిపాలం గ్రామంలో ఈ ఘటన జరిగింది. ప్రమాదవశాత్తు గెడ్డలో జారిపడిన 13 ఏళ్ల బాలిక గల్లంతైన ఘటన గురువారం చోటు చేసుకుంది. కాళ్ల ధనుశ్రీ (13) తల్లి గౌరి, తండ్రి శ్రీనుతో కలిసి బట్టలు ఉతికేందుకు గెడ్డకు వెళ్లింది. ఆ సమయంలో పొరపాటున కాలుజారి గెడ్డలోకి కొట్టుకుపోయిందని తల్లి గౌరి తెలిపారు. దీంతో ధనుశ్రీ ఆచూకీ కోసం గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు గెడ్డలో గాలింపు చర్యలు చేపట్టారు.

# జోగి చుట్టూ ఉచ్చు!

మొదటి పేజీ తరువాయి...

జనార్ధన్ రావు సంచలన విషయాలు వెల్లడించారు. జోగి రమేష్ ఆర్థికంగా సహాయం చేస్తానని హామీ ఇచ్చాడని, అయితే ఆ తర్వాత విడిచిపెట్టారని జనార్ధన్ రావు అధికారులకు తెలిపారు. జోగి రమేష్ సూచనల మేరకే విషయం లీక్ చేసి రైడ్ జరిగేలా చేశానని వివరించారు. అయితే, జోగి రమేష్ మాత్రం తనకు జనార్ధన రావు అనే వ్యక్తి తెలియదని, నకిలీ మద్యం కేసుతోనూ తనకు ఎలాంటి సంబంధం లేదని, తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. జనార్ధన రావును తానెప్పుడూ కలవలేదని స్పష్టం చేశారు. అయితే జనార్ధనరావుతో జోగి రమేష్ ఉన్న కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చాయి. కల్తీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు జనార్ధన్ రావు వాస్తవాలు సిట్ అధికారులకు వెల్లడించడంతో జోగి రమేష్‌కు ఉచ్చు బిగుస్తోంది. జనార్ధన్ రావు స్టేట్‌మెంట్‌ను ఆడియో, వీడియో రికార్డింగ్ తోపాటు లిఖిత పూర్వకంగా ఎక్సైజ్, సిట్ అధికారులు కోర్టుకు సమర్పించారు.

# బాబు వల్లే తుపాను నష్టం

మొదటి పేజీ తరువాయి...

దశలో ఉన్నప్పుడు తుపాను వచ్చినందున దిగుబడులు బాగా తగ్గిపోతాయన్నారు. నేలకొరిగిన పంట తిరిగి నిలబడటం కష్టమవుతుంది తెలిపారు. 25 జిల్లాల్లో 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని జగన్ తెలిపారు. 11 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం దాటిల్లిందని.. 1.14 లక్షల ఎకరాల్లో పత్తి, 1.15 లక్షల ఎకరాల్లో వేరు శనగ, 2 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.9 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు దెబ్బతిన్నాయన్నారు. రైతులకు పార్టీ పరంగా తోడుగా నిలబడాలని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. రైతులకు టీడీపీ ప్రభుత్వం సాయం చేయడం లేదన్నారు. మన ప్రభుత్వంలో ఆర్బీకేల వ్యవస్థ అప్రమత్తంగా ఉండేది. ప్రతి పంటకూ ఇ-క్రాప్ చేసే వాళ్లమని గుర్తు చేశారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు సమన్వయంతో పని చేసి.. ఉచిత పంటలబీమాతో రైతులకు భరోసా ఉండేదన్నారు. 80 లక్షల మంది రైతులు ఉచిత పంటల బీమా అందుబాటులో ఉండటం వల్ల 70 లక్షల ఎకరాల పంట బీమా పరిధిలో ఉండేది. ప్రీమియం కట్టిన రైతులు 19 లక్షలమందికి మాత్రమే బీమా అందుబాటులో ఉంది.



మిగిలిన రైతుల పరిస్థితి ఏం కావాలని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లో అల్పపీడనలు, వాయుగుండాలు, తుపాన్లు కారణంగా 16 వచ్చాయని జగన్ లెక్క చెప్పారు. ఎన్ని విపత్తులు వచ్చినా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోలేదన్నారు. ఏ రైతునూ ఆదుకున్న పరిస్థితి లేదు. ఇ-క్రాప్ అందించిన పరిస్థితి కూడా లేదు. వాళ్లు వేసిన అరకొర లెక్కల ప్రకారమే 5.5 లక్షలమంది రైతులకు రూ.600 కోట్లు పెండింగ్‌లో పెట్టారు. మిర్చికి క్వింటాలుకు రూ.11,781కి కొనుగోలు చేస్తామన్నారు ఒక్క రూపాయికూడా రైతుకు ఇవ్వలేదు. పొగాకును కొనుగోలు చేస్తామ న్నారు దిక్కూ మొక్కూ లేదు. మామిడిని కిలో రూ.12లకు కొనుగోలు చేస్తామన్నారు. ఒక్క రైతు నుంచీ కొనుగోలు చేయలేదన్నారు. ఉల్లి రైతులకు హెక్టారుకు యాభై వేలు ఇస్తామన్నారు. అదికూడా ఇచ్చిన పాపాన పోలేదు. ఇ-క్రాప్ నీరుగార్చారని జగన్ అన్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వం తరఫున ప్రీమియం కట్టి 54.55 లక్షల మంది రైతులకు రూ.7800 కోట్లు ఇన్సూరెన్స్ ఇప్పించగలిగాం. కాని ఇవాళ పరిస్థితి దారుణంగా ఉంది. ఈ ప్రభుత్వం రైతుల నడ్డి విరిచింది. చంద్రబాబు సృష్టించిన విపత్తు ఇది అని జగన్ విమర్శలు గుప్పించారు. పార్టీ నేతలందరూ.. రైతులకు మేలు చేయాలని.. సాయం చేయాలని జగన్ పిలుపునిచ్చారు.

## బోటు మునిగిన మత్స్యకారుడికి రూ. 30 లక్షల నష్టపరహారం తక్షణమే చెల్లించాలి

### మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్

**విశాఖపట్నం జయ జయహే**

విశాఖ ఫిషింగ్ హార్బర్ సెంట్రల్ డాక్ ప్రాంతంలో మత్స్యకారుడు మేరుగ ధనరాజు బోటు తుఫాను అలలు దాటికి మునిగిపోవడం జరిగిందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆ మత్స్యకారుడికి రూ. 30 లక్షల నష్టపరహారం చెల్లించాలని వైసీపీ నాయకులు, మాజీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మత్స్యకారుడుని పరామర్శించిన వాసుపల్లి గణేష్ కుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ఎవరికి ఎటువంటి కష్టం వచ్చిన ,నష్టం వచ్చిన అప్పటి ప్రభుత్వం ముందుండి తక్షణ సహాయక చర్యలు చేపట్టి వారిని ఆదుకోవడం జరిగేదని అన్నారు.గతంలో ఇక్కడ ఒక బోటు కాలిపోతే అప్పటికప్పుడే వైసిపి ప్రభుత్వం రూ.36 లక్షల ను ఆ మత్స్యకారుడుకి అందించడం జరిగిందని వెల్లడించారు.వైసిపి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వాన్ని స్పష్టం చేశారు. నేడు కూటమి ప్రభుత్వం వలన ఎవరికి ఎటువంటి ప్రయోజనం లేదని పేర్కొన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని అన్నారు. ప్రజలను గాలికి వదిలేసి ఈ ప్రభుత్వం దుష్ట పాలన చేస్తుందని ఆరోపించారు.ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన



ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడంలేదని విమర్శించారు.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాగ్దానాలు పేపర్ల వరకు పరిమితం అని అవి వాస్తవ రూపంలో అమలు జరగడంలేదని తెలియజేశారు.ఫిషింగ్ హార్బర్ లో మునిగిపోయిన బోటుకు నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం జరిగిందన్నారు.ఒట్టి మాటలతో ప్రజలను మోసగించకుండా వారికి ప్రభుత్వం అండగా ఉండాలని తెలిపారు.మునిగిపోయిన బోటుకి తక్షణమే ప్రభుత్వం రూ.30 లక్షలను నష్ట పరిహారం చెల్లించాలని వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు.

## తుపాను నష్టం రూ.5265 కోట్లు

**ప్రాథమికంగా ప్రభుత్వ అంచనా**

**వ్యవసాయరంగానికి రూ.829 కోట్లు**

**హార్టికల్చర్‌కు రూ.39 కోట్లు**

**మత్స్యరంగానికి రూ.1,270 కోట్లు**

**ఆర్‌అండ్‌బీకి రూ.2,079 కోట్లు**

**నీటిపారుదలశాఖకు రూ.207 కోట్లు**

**(అమరావతి - జయజయహే)**



మొంథా తుపాను ప్రాథమిక నష్టం అంచనా దాదాపు రూ.5265 కోట్లు అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. పూర్తి స్థాయి నష్టం అంచనాలను త్వరితగతిన సిద్ధం చేసి కేంద్రానికి పంపుతామని తెలిపారు. పటిష్ఠమైన సమాచార సాంకేతిక వ్యవస్థను 16 నెలల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. నీళ్లు ఎక్కడా నిల్వ లేకుండా డ్రైన్స్‌లోకి పంపగలిగామని తెలిపారు. ఎక్కడ నీరు నిలిచినా డ్రోన్లు, సీసీటీవీల ద్వారా గుర్తించి తొలగించగలిగామని అన్నారు. ఒకప్పుడు చెట్టు కూలితే తొలగించేందుకు రోజుల తరబడి సమయం పట్టేదని కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేకుండా గంటల వ్యవధిలోనే సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టం ద్వారా కాటమనేని భాస్కర్ బృందం కనబర్చిన పనితీరు అభినందనీయమని కొనియాడారు. మొత్తం సిబ్బంది అద్భుత పనితీరు కనబరిచారని ప్రశంసించారు. తుపాను నష్ట తీవ్రత తగ్గించే అంశంపై మంత్రులు క్షేత్ర స్థాయిలో, ఆర్టీజీఎస్ నుంచి మంత్రులు లోకేష్, అనిత ఎప్పటికప్పుడు పర్యవేక్షించారని వివరించారు. ఇప్పటికీ 35 మండలాల్లో వర్షం పడలేదని 37 కరవు మండలాలు నమోదయ్యాయని సీఎం వెల్లడించారు. నదుల అనుసంధానం జరిగితే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ తుపాను వల్ల ఎక్కువ నష్టం బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో ఉందని చెప్పారు. వచ్చే విపత్తును ఆపలేం కానీ ప్రాణ నష్టం జరగకుండా ఎన్ని చర్యలు చేపట్టాలో అన్ని చేపట్టామని సీఎం చంద్రబాబు తెలిపారు. తుపాను వల్ల రాష్ట్రానికి నష్టం వాటిల్లిందని అన్నారు. అలానే దీని వల్ల వ్యవసాయరంగానికి, ఆర్‌అండ్‌బీకి భారీగా నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇంకా తుపాను వల్ల ఎవరూ చనిపోలేదని కానీ 120 పశువులు మృతి చెందాయని వెల్లడించారు. ఈ తుపాను వల్ల ఆర్‌అండ్‌బీకి ఎక్కువ నష్టం వాటిల్లిందని కానీ నీటిపారుదల శాఖకు సంబంధించి ఈసారి నష్టం తక్కువేనని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో డ్యామ్‌లు కొట్టుకుపోయాయని సీఎం విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టు గేట్లు పని చేయలేదని ఎక్కడా ఫిర్యాదు లేదని, మా అప్రమత్తత వల్ల నీటిపారుదల శాఖకు నష్టం తక్కువ వాటిల్లిందని అన్నారు.

**సిబ్బంది సేవలు భేష్..**

రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది అందరూ నిబద్ధతతో పని చేశారని ఇది చాలా సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. వర్షాలు పడుతున్నా కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించి ఇబ్బందులు లేకుండా చేశారని కొనియాడారు. ప్రకృతి విపత్తులను ఎవరూ ఆపలేరు కానీ ముందస్తు చర్యల వల్ల నష్టాన్ని తగ్గించవచ్చని సీఎం అన్నారు. మ్నొంథా తుపాను బీభత్సాన్ని ముందుగానే అంచనా వేయడం వల్లే నష్టనివారణ తగ్గిందని, ఓ పద్ధతి ప్రకారం సాంకేతికతను సక్రమంగా వినియోగించామని తెలిపారు. గతంలో విద్యుత్ సరఫరా ఆగితే 10 గంటల వరకు వచ్చేది కాదు కానీ ప్రస్తుతం విద్యుత్ సరఫరా ఆగిన 3 గంటల్లోనే పునరుద్ధరణ జరిగిందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం సాంకేతికతను ఉపయోగించి ప్రజలకు నష్టం వాటిల్లకుండా చూస్తుంటే కొందరు ఫేక్ పోస్టులు పెడుతున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడం కూడా వారికి ఇష్టం లేనట్టు ఉందని విమర్శించారు. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా పరిస్థితిని అంచనా వేశామన్నారు. గతంలో గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని మండిపడ్డారు. కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు భరోసా ఇచ్చారని ప్రశంసించారు. వారందరికీ అభినందనలు తెలిపారు.

**శాఖల వారీగా నష్టం వివరాలు:**

రాష్ట్రవ్యాప్తంగా రూ.5,265 కోట్లు నష్టం (ప్రాథమిక అంచనా)

వ్యవసాయరంగానికి రూ.829 కోట్లు
హార్టికల్చర్‌కు రూ.39 కోట్లు
మత్స్యరంగానికి రూ.1,270 కోట్ల
ఆర్‌అండ్‌బీకి రూ.2,079 కోట్లు
నీటిపారుదలశాఖకు రూ.207 కోట్లు



## బురద నీటిలో.. పంట పొలంలో..

తీసుకున్నామని తెలిపారు. కృష్ణా జిల్లాలో తుపాను ప్రభావిత ప్రాంతంలో పవన్ కల్యాణ్ పర్యటించారు. కోడూరులో దెబ్బతిన్న పంట పొలాలను సందర్శించారు. బురదలో దిగి నీటిలో మునిగిన పంటలను పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ వెంట మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, మంత్రి వాసంశెట్టి సుభాష్, స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, కలెక్టర్ బాలాజీ ఉన్నారు. మొంథా తుపాను ప్రభావంతో కృష్ణా జిల్లా వ్యాప్తంగా జరిగిన పంట నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను పవన్ కల్యాణ్ తిలకించారు. అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ ముందస్తు చర్యలతో చాలా వరకు నష్టం తగ్గించామని అలానే ప్రజలకు ఎలర్ట్ మెసేజ్‌లు కూడా పంపామని వెల్లడించారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో బాగా నష్టం జరిగిందని వివరించారు. ప్రతి జిల్లా కలెక్టర్‌లు, ప్రభుత్వ యంత్రాంగం బాగా పని చేశారని అభినందించారు. 46 వేల హెక్టార్లలో వరి, 14 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బ తిన్నాయని తెలిపారు. కోయ సుబ్బారావు చెట్టు మీద పడి చనిపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు బియ్యం ఉచితంగా ఇస్తున్నామని, ఇంకా పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని పవన్ అన్నారు. "ప్రభుత్వ



యంత్రాంగం బాగా పని చేసింది. 46 వేల హెక్టార్లలో వరి, 14 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు బియ్యం ఉచితంగా ఇస్తున్నాం. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాం. డ్రెయిన్ల పూడికతీత ద్వారా నీరు నిల్వ లేకుండా చేశాం. ముందస్తు చర్యల వల్ల నష్టం చాలావరకు తగ్గింది. ఆక్వా రైతుల ఇబ్బందులు నా దృష్టికి వచ్చాయి. సీఎంతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తాం." అని పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఇళ్లకు వెళ్లే సమయంలో కూడా ఒక్కో కుటుంబానికి 3 వేల రూపాయలు ఇస్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు. డ్రైన్ల పూడిక తీతల ద్వారా నీరు నిల్వ లేకుండా చేశామని వెల్లడించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముందస్తుగా తీసుకున్న చర్యలు వల్ల నేడు నష్టం చాలా వరకు తగ్గిందని అన్నారు. ఆక్వా రైతుల ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని సీఎంతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు పాడైతే యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తామని, అలానే 2 రోజుల్లో మొత్తం చెత్తను క్లీన్ చేసేలా వేలాది మంది సిబ్బంది పని చేస్తున్నారని పవన్ కల్యాణ్ వెల్లడించారు. అంతకుముందు మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో పవన్ కల్యాణ్ పుట్టలో పాలుపోసి ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ అధికారులు, అర్చక బృందం పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసిన పవన్ మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి సంబంధించిన విశిష్ట ఆర్చనలు, ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అర్చక స్వాములు పవన్ కల్యాణ్‌కు అందజేశారు.

## పులిచింతలకు భారీగా వరదనీరు

### ప్రకాశం బ్యారేజి వద్ద పెరుగుతున్న వరద

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు పులిచింతల ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. ప్రాజెక్ట్‌కు 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో.. అధికారులు 4 లక్షల 90 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ప్రకాశం బ్యారేజ్‌కు 2 లక్షల 74 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం చేరింది. దీంతో అధికారులు బ్యారేజ్ అన్ని గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌కు మున్నేరు, కీసర, వైర, కట్టలేరు నుంచి సుమారు 2 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరింది. సాయంత్రానికి ప్రకాశం బ్యారేజ్‌కు పులిచింతల నుంచి సుమారు 4 లక్షల 80 వేల క్యూసెక్కుల వరద నీరు చేరుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజ్‌కు సాయంత్రానికి సుమారు 5 నుంచి 6 లక్షల క్యూసెక్కుల వరద చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో బ్యారేజ్ దిగువ భాగాన ఉన్న కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాలలోని నదీతీర మండలాలు, గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. లంక గ్రామాల ప్రజలు అలర్ట్‌గా ఉండాలని అధికారులు కోరారు. భారీ వర్షాలకు కృష్ణానది వరద ప్రవాహం పెరుగుతోందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. పులిచింతల, ప్రకాశం బ్యారేజ్ వద్ద దిగవకు వరద నీటి విడుదల చేసినట్లు చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రస్తుతానికి ఇన్ ఎలో, ఔట్ ఎలో 2.74 లక్షల క్యూసెక్కులుగా ఉందన్నారు. బ్యారేజ్ వద్ద సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని.. వరద ఎలో 5 లక్షల క్యూసెక్కులు వరకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు.



# మొంథా తుఫాన్‌తో భారీగా నష్టం

### చెరువులుగా మారిన ఊరూవాడలు

### భారీగా పంట నష్టం వాటిల్లినట్లు అంచనా

మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిస్తున్నాయి. హుజురాబాద్, శంకరపట్నం, సైదాపూర్ మండలాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశవపట్నం వాగు ఉప్పొంగడంతో ఐకేపీ కేంద్రం గోడ కూలి నిల్వ ఉంచిన వరి ధాన్యం కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. వాగు ఉప్పొంగడంతో.. సైదాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. హుజురాబాద్‌లో కూడా చిలుకవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో.. జూపాక రోడ్డు తెగి పోయింది. భారీ వర్షం కారణంగా రోడ్డుపై ఆరబెట్టిన వడ్లు కూడా కొట్టుకుపోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫాన్ కారణంగా.. తెలంగాణలోని పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా భారీగా పంట నష్టం వాటిల్లింది. కుండపోత వర్షాలకు వరంగల్ - ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. దీంతో ఆ రూట్‌ని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. తుఫాన్ ప్రభావంతో వరంగల్, హనుమకొండ తడిసి ముద్దయింది. అలాగే.. సిద్దిపేట జిల్లా చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలల్లో వరి పంటకు అపార నష్టం వాటిల్లింది. చేర్యాల మండలంలో.. భారీగా వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ముస్త్యాల వద్ద రాగికుంట పొంగిపొర్లడంతో చేర్యాల - హుస్నాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం కారణంగా.. భారీగా ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మద్దూర్‌లో 22 సెం.మీ, దూల్మిట్ట 19 సెం.మీ, చేర్యాల 17సెం.మీ, కొమురవెల్లి 12సెం.మీల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే చాలా జిల్లాల్లో వరి ధాన్యం, మొక్క జొన్న పంటలు, చేతి కొచ్చిన పత్తి పంట తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# కేదారనాథేశ్వరుడు

### (5వ జ్యోతిర్లింగం)

### (డా: సి.హెచ్. ప్రతాప్)

హిమాలయ పర్వత శ్రేణుల మధ్య, మంచుతో ముస్తాబైన శిఖరాల ఒడిలో, నిశ్శబ్ద ధ్యానంలో వెలసిన పవిత్ర క్షేత్రం కేదారనాథేశ్వర జ్యోతిర్లింగం. ఉత్కంఠ కలిగించే ఆ పర్వత గర్భంలో శివుని ఆత్మతత్త్వం ప్రత్యక్షమైనట్టుగా అనుభవమయ్యే ఈ స్థలాన్ని జ్ఞాన%–%పార్వతీ మొదలైన దేవతల ధ్యానకేంద్రం గా పురాణాలు వర్ణిస్తాయి. ఇక్కడ వాయు, నీరు, అగ్ని, ఆకాశం, భూమి ౧ ఐదు భూతాలు సమతుల్యంలో నిలబడినట్టుగా అనిపిస్తుంది.

మహాభారత యుద్ధానంతరం, పాశ్చాత్తాపంతో పాండవులు శివుని శరణు కోరారు. శివుడు వారి బాధను, వారి ఆత్మలోని క్లిష్ట సంకెళ్లను తెలుసుకున్నాడు. యుద్ధరక్తపు ఋణం నుంచి విముక్తి పొందాలంటే, వారికి లోతైన అంతర్మార్గ శుద్ధి అవసరం. అందుకే శివుడు ఇక్కడ కేదారరూపంలో ప్రత్యక్షమయ్యాడు. పర్వతం మధ్యలోని బుగ్గపర్వతంకాకుండా, ధ్యానంలో నిశ్చలమైన గిరిస్వరూపంగా ఆయన నిలిచాడు.

ఇక్కడ శివుని లింగం సాధారణంగా ఉండదు. దీని ఆకారం పర్వతఘనతను, బలాన్ని, ధైర్యాన్ని సూచిస్తుంది.

అది మనసు కదలికలను ఆపి, ఆత్మను లోపలికి నడిపించే శిలారూప ధ్యానమూర్తి. కేదార్ యాత్ర కేవలం యాత్ర కాదు ౧ అది అంతర్మార్గ సాధన. ఇక్కడికి భక్తుడు శరీరంతో కాకుండా మనసుతో చేరాల్సి ఉంటుంది. అక్కడి



గాలిలోనే శివతత్త్వం విహరిస్తుంది.మంచు గాలుల్లో కూడా ఒక జ్ఞానానురణనం వినిపిస్తూనే ఉంటుంది.

హిమాలయాలు ఇక్కడ సాక్షుల్లా నిలుస్తాయి. వాటి నిశ్శబ్దమే శివతత్త్వానికి వేదాంతభాష్యం.అక్కడ మాటలు అవసరం ఉండవు.వెలుగు, నిశ్శబ్దం, ధ్యానం ౧ వీటే పూజాసామగ్రి.

కేదారానది ఇక్కడ జ్ఞానసరోవరంలా ప్రవహిస్తుంది.నీరు మంచు ముద్దల్లా చల్లగా ఉన్నా,స్పర్శ మనసుకు ఉష్ణాన్ని ఇస్తుంది.ఈ నది జలాన్ని పురాణాలు లి"శివుని అనుగ్రహభావంలో కరిగిన కరుణ"లిగా పేర్కొంటాయి.ఇక్కడ రాత్రిళ్లు ఆకాశం నక్షత్రాలతో నిండిపోతుంది.

అవి జ్వలించే అగ్నిభాస్వరాలు కాకుండా,పురాతన ఋషుల మౌనప్రమాణాల్లా కనిపిస్తాయి.గాలి ప్రయాణించే ప్రతి సవ్వడిలో "ఓం నమః శివాయ" నినాదం వినిపిస్తుంది.కేదారనాథేశ్వర దర్శనం మనసును ఆపి ప్రశ్నించడానికి నియోగిస్తుంది:



"నేను ఎవరు?""నేను శరీరం కాదు.""నేను భావం కాదు.""నేను తాత్కాలికం కాదు.""నన్ను నడిపించే శక్తి ఎక్కడ ఉంది?"

ఈ ప్రశ్న హిమాలయ మంచులో మెరుస్తున్న అగ్నికణంలా కదిలిస్తుంది.సమాధానం బయటలో కనిపించదు.అది ఆత్మలోని నిశ్చలంలో వికసిస్తుంది.నిశ్శబ్దంలో, శ్వాస మధ్య ఖాళీలో,మనసు ఏకాంతంగా నిలబడిన క్షణంలో,శివుని అనుభూతి సహజంగా ఉద్భవిస్తుంది.

కేదార దర్శనం పూజ కాదు ౧ ఆవిష్కరణ.ప్రార్థన కాదు ౧ పరిచయం.దర్శనం కాదు ౧ చైతన్య జాగృతం.ఇక్కడ శివుడు కేవలం దేవుడు కాదు.

ఆయన బలం.ఆయన స్థిరత్వం.ఆయన ప్రశాంతి.ఆయన మన లోపలి నిశ్శబ్ద ప్రకాశం.కేదారనాథేశ్వర యాత్ర మనసులోకి తీసుకెళ్లే మార్గం.

పర్వతాన్ని ఎక్కుతాం కానీ చేరేది మన ఆత్మ శిఖరాలకే.ఈ పవిత్ర జ్యోతిర్లింగం మనకు జ్ఞాపకం చేస్తుంది:

"నీవు ఒంటరివి కాదు.నీ లోపల శివుడే నిలుస్తున్నాడు."

# సహాయ, పునరావాసం తక్షణ కర్తవ్యం కావాలి!

మొంథా తుఫాన్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. వాగులు, వంకలు చెరువులు ఏరులయ్యాయి. వేల ఎకరాల్లో పంటలు మునిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షం వచ్చినా వరదలు వచ్చినా, తుఫాన్లు వచ్చినా తొలుత నష్టపోయేది మాత్రం రైతన్నలే. ఇరు తెలుగు రాష్ట్రాల్లో రైతులు భారీగా నష్టపోయారు. పంటలు నీటమునిగాయి. వరిచేలు నీట మునిగింది. కొన్నిచోట్ల ఆరపోసిన ధాన్యం కొట్టుకు పోయింది. కోతదశకు వచ్చిన పంట నేలకొరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేల ఎకరాల వరకూ వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. నేలకు ఒరిగిన పంటను పైకి లేపి కట్టలుగా కట్టాలని అధికారులు సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో పంట నేలవాలడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అరటి పంటలు సైతం దెబ్బతిన్నాయి. ఇప్పుడు ప్రభుత్వాలు తొలుత ఆదుకోవాల్సింది రైతన్నలనే. నివేదికలతో ఆలస్యం చేయకుండా రైతులను తొలుత ఆదుకోవాలి. నీరు చేరడంతో నానిన పంటలను కొనుగోలు చేయాలి. మునిగిన పంటలకు వెంటనే పరిహారం చెల్లించాలి. దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చాలి. అతిభారీ వర్షాలతో వాగులు,వంకలు ఉగ్రరూపం తో ప్రవహిస్తున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో, పాతాళగంగ దారిలో కొండచరియలు విరిగిపడ్డాయి. నల్లమలలోనూ చెరువులు, కుంటలు నీటితో నిండిపోయాయి. చెరువులు నిండుకుండల్లా తయారయ్యాయి. వందల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో తీరం దాటిన మొంథా తీవ్ర తుపాను.. అతిభారీ వర్షాలు, బలమైన గాలులతో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్ని ముంచేసింది. ఇటు తెలంగానలో ఖమ్మం, వరంగల్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలను ముంచెత్తింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనూ భారీవర్షాలతో వాగులు పొంగి ప్రవహించడంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. సముద్రం 20-30 మీటర్లు ముందు కొచ్చింది. వందల గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు నేలవాలడంతో సరఫరా స్తంభించింది. ప్రభుత్వ చర్యలతో చాలాచోట్ల పునరుద్ధరించారు. సాధారణ స్థితికి రావడానికి మరికొంత కాలం పట్టవచ్చు. తీరప్రాంత మండలాల్లో గాలుల దెబ్బకు చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కోల్‌కతా-చెన్నై జాతీయరహదారిపై రాకపోకలు నిలిచాయి. ముందే ముప్పును గుర్తించి చాలామందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. నంద్యాల పట్టణం మధ్యలో ప్రవహించే కుందూనది, మద్దిలేరు, చామకాలువ కూడా ఉప్పొంగడంతో పలు ప్రాంతాలు జలమయ మయ్యాయి. శ్రీశైలం-హైదరాబాద్ మార్గంలో సున్నిపెంట దాటిన తర్వాత కొండ చరియలు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. భారీ వృక్షాలు నేలకూలి రహదారులకు అడ్డంగా పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాలకు జలాశయంలో



పెద్దఎత్తున నీరు చేరడంతో విజయనగరం జిల్లా పరిధిలోని తాటిపూడి రిజర్వాయరు గేట్లు ఎత్తేశారు. ఆ నీటి ఉద్ధృతికి విశాఖ జిల్లా భీమిలి మండలంలోని గోస్తనీ నది పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గత వారం రోజుల పాటు ప్రజలను గజగజలాడించిన మొంథా తుఫాను ప్రభావం ఉపశమించడంతో, ప్రమాదం నుండి బయట పడ్డామని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురిసాయి. తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు అతలాకుతలం చేశాయి. వాగులు, వంకలు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వరదలతో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది. వరద నీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసారు. ఉమ్మడి వరంగల్ జిల్లాపై మొంథా తుఫాన్ పంజా విసిరింది. భారీ వర్షాలతో వరంగల్‌లో రహదారులు నీట మునిగాయి. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం తీగల బంజర వద్ద పగిడేరు వాగు ఉధృతంగా పారడంతో 20 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వాలు పునరుద్ధరణ చర్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయాలు పక్కన పెట్టి క్షేత్రస్తాయిలో నష్టం అంచనాలు వేసి సహాయ, పునరావాస కార్యక్రమాలు ముమ్మరం చేయాలి. రోడ్లను మరమ్మత్తులు చేసి రాకపోకలు పునరుద్దరించాలి. పంటల నష్టాలను అంచనా వేసి రైతులకు ముందుగా తాత్కాలిక ఉపశమనం కలిగించాలి. ఇళ్లు వాకిళ్లు కొట్టుకుపోయిన వారిని గుర్తించి వారికి నిత్యావసరాలతో పాటు జీవనోపాధి కింది పరిహారం అందించాలి. యుద్ధప్రాతిపదికన ఇవి చేపడితే తప్ప ప్రజలు కోలుకోలేరు. ప్రభుత్వాలు వెంటనే ఈ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. కేంద్రం కూడా నివేదికల కోసం ఎదురు చూడకుండా ముందుగా తక్షణ సాయంగా కొంత డబ్బును రాష్ట్రాలకు అందించాలి. అవసరమైతే గ్రామాల వారిగా బాధజతులను గుర్తించి అక్కడిక్కడే పరిహారం చెల్లింపులు చేయాలి. గతంలో లాగా నెలల తరబడి వేచిచూసే ధోరణికి స్వస్తి పలకాలి.

### కరూర్ ఘటన తరవాత

# మళ్లీ ప్రజల్లోకి విజయ్

### పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్న నేత



కరూర్ రోడ్‌షోలో 41 మంది దుర్మరణం సంఘటన తర్వాత పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్న తమిళగ వెట్రి కళగం నేత విజయ్ మళ్ళీ పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇటీవల కరూర్ మృతుల కుటుంబ సభ్యులను మహాబలిపురం రిసార్ట్‌కు రప్పించి వారికి క్షమాపణ చెప్పి, గాయపడిన వారికి తలా రూ.2లక్షలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన తర్వాతే ఆయన ధాన్యం కొనుగోలు వ్యవహారంపై డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సుదీర్ఘ ప్రకటన చేశారు. బుధవారం సాయంత్రం పార్టీ సీనియర్ నేతలతో సమావేశమై 28 మంది సభ్యులతో కొత్త కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా సాగించాలని ఆయన నిర్ణయించారు. ఆ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అధ్యక్షతన పనయూరులోని పార్టీ కార్యాలయంలో కొత్త కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ నిర్వాహక కమిటీ తొలిసమావేశం సాఫీగా సాగిందని, మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా కొనసాగించాలని పార్టీ నాయకులంతా సూచించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. కరూర్ దుర్ఘటన పార్టీ వ్యవహారాలను పూర్తిగా స్తంభింపజేసిందని, ఆ శోకం నుండి పూర్తిగా బయటపడి పార్టీ నాయకుడు విజయ్ మళ్ళీ చురుకుగా పార్టీపై దృష్టిసారిస్తున్నారన్నారు. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంటారా? అని విలేఖరుల ప్రశ్నించగా, నెల రోజులకు ముందు పార్టీ ఏ స్థితిలో ఉండేదో ఆ స్థితిలోనే పార్టీ వ్యవహారాలు కొనసాగుతాయని ఆ పార్టీతో పొత్తు లేనట్లేనని సూచన ప్రాయంగా నిర్మల్‌కుమార్ తెలియజేశారు.

# 2 వేలు తగ్గిన పసిడి ధరలు

బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీపావళి సమయంలో రికార్డు స్థాయికి చేరిన పసిడి ధర, ప్రస్తుతం తగ్గుముఖం పడుతోంది. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాల వల్ల పసిడితో పాటు వెండి ధరలు కూడా తగ్గుతున్నాయి. గత రెండు వారాల్లో పసిడి భారీగా తగ్గింది. ఈ క్రమంలో బంగారం ధర గురువారం కూడా భారీగా పడిపోయింది. దాదాపు రూ.2 వేలు తగ్గింది. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర తగ్గడంతో దేశీయంగా బంగారం ధరలు పతనమవుతున్నాయి. భారత్‌లో నిన్న 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం రూ.1,22,400 ఉంది. ఇవాళ రూ.1,910 మేర తగ్గి రూ.1,20,490 చేరింది. దీంతో పసిడి ప్రియులు కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు.

# సైబర్ క్రైమ్స్ మీద మహిళా కళాశాల విద్యార్థులకు అవగాహన

**రాజమహేంద్రవరం, జయజయహే :**



రాజమండ్రి నగరంలోని గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాలలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ ఆదేశాలనుసారం మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై షేక్ సుభాని గురువారం విద్యార్థినిలకు సైబర్ క్రైమ్ మీద అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థినిలు సైబర్ క్రైమ్ పై పూర్తి అవగాహనతో ఉండాలని, సైబర్ క్రైమ్ చేసేవాళ్లు మొబైల్ ఫోన్లను హ్యాకింగ్ చేస్తారని దానితో మన బ్యాంకు అకౌంట్స్ హ్యాక్ చేసి మన అకౌంట్లో ఉన్న డబ్బుని వారి అకౌంట్లోకి ట్రాన్స్ఫర్ చేసుకొని దొంగిలిస్తారని. మనకు ఎటువంటి సంబంధం లేకుండానే, తెలియకుండానే మన బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులు వేరే ఒకరి బ్యాంక్ అకౌంట్లకు ట్రాన్స్ఫర్ అవ్వడం లేదా ఎకౌంటు డీటెయిల్స్ ను హ్యాక్ చెయ్యడం సైబర్ క్రైమ్ అంటారని, మనకు తెలియని వ్యక్తులు ఎవరైనా లోన్ ఇస్తానని వస్తే మనం వద్దని చెప్పాలని, మన సోషల్ మీడియాలో మనం పెట్టే ఫోటోలు లేదా వీడియోలు ను సైబర్ నేరగాళ్లు మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేసి డబ్బు కోసం బెదిరిస్తారని, మనం మన సెల్ ఫోన్ ని చాలా జాగ్రత్తగా ఉపయోగించుకుంటే మనకు ఏ విధమైన ఇబ్బంది ఉండదని అజాగ్రత్తగా ఉంటే మనమే తర్వాత నష్టపోతామని అన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా ఒక అమ్మాయి అబ్బాయిలను పెళ్లి చేసుకోకూడదని అలా చేస్తే అది చట్టానికి విరుద్ధమని చట్టం వారిపై తగు చర్యలు తీసుకొని జైలుకు కూడా పంపిస్తారని, అలాగే ఇటువంటి పనులను ప్రోత్సహించిన వారి మీద ఫోక్సో కేసు పెడతామని, అమ్మాయిలకు ఏదైనా ఇబ్బంది ఉంటే ఎవరికైనా ప్రాబ్లం ఉంటే ఒకటి ఒకటి రెండు కు కాల్ చేసి పోలీసులతో చెప్పాలని, అమ్మాయిలు దిశా యాప్ ద్వారా లేదా శక్తి యాప్ ద్వారా కంప్లైంట్ చేయాలని, మనం వాడే సెల్ ఫోను మంచి వాటికి ఉపయోగించితే మంచిదని చెడ్డవాటికి ఉపయోగిస్తే చెడ్డదవుతుందని, ఫోను అత్యంత ప్రమాదకరమని, మన యొక్క చిత్రాలు ఫోటోలు మార్ఫింగ్ చేస్తారని అందువల్ల మన యొక్క ఫోటోలు గాని పర్సనల్ విషయాలు గానీ ఎవరికీ ఇవ్వకూడదని, ఒకవేళ మనల్ని ఎవరైనా అబ్బాయిలు హెరాస్ చేస్తుంటే మన కాలేజీ ప్రిన్సిపాల్ గారికి గాని క్లాస్ ఇన్చార్జి మేడం గారికి గాని చెప్పాలని దాని ద్వారా ప్రాబ్లం పోలీసులకు చేరవేసి తగిన రక్షణ పొందాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కే.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటిదాకా మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ షేక్ సుభాని గారు చెప్పిన విషయాలను ప్రతి ఒక్క విద్యార్థి పాటించి సైబర్ నేరగాళ్ల నుంచి జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం కె ఎస్ ప్రసాద్, పోలీస్ కానిస్టేబుల్ పి. దుర్గాప్రసాద్, ఎస్ కే నజీర్, టీ. మణికుమార్, పి. గౌతమి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## గడువులోగా మాస్టర్ ప్లాన్ రహదారులు పూర్తి చేయాలి

### వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్

**విశాఖపట్నం (జయ జయహే)**

భోగాపురం ఎయిర్ పోర్టు కు అనుసంధానించే ప్రధాన రహదారుల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, వాటిని గడువులోగా పూర్తి చేయాలని వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఛాంబర్ లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ కు సంబంధించిన 7 ప్రధాన రహదారుల పురోగతిని ప్రతీ 15 రోజులకు ఒకసారి సమీక్షించటం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా కైలాసగిరిపై నిర్మాణంలో ఉన్న త్రిశూల్ ప్రాజెక్ట్ పనులు కూడా జనవరి నెలాఖరుకి పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. వుడా పార్క్ ఆవరణలో స్కేట్ బోర్డ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. తదుపరి ప్రణాళిక విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎల్ ఆర్ ఎస్ కు సంబంధించి ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు పరిశీలన వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా ఇటీవల ప్రభుత్వం ఎల్ ఆర్ ఎస్ కు దరఖాస్తుల గడువు వచ్చే ఏడాది జనవరి 23 వరకు పెంచిందని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కమిషనర్ కె రమేశ్ , చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా, ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదన రావు, తదితరులు పాల్గొన్నారు.



## సోమలింగపాలెం, కట్టుపాలెం ముంపు ప్రాంతాలలో పర్యటించిన ప్రగడ

**యలమంచిలి, జయ జయహే న్యూస్**

మున్సిపాలిటీ పరిధిలో సోమలింగపాలెం, కట్టుపాలెం గ్రామాలలో మైనర్ శారద ముంపు ప్రాంతాలలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ పిల్ల రామకుమారి పర్యటించారు. ఈ సందర్భంగా ముంపుకు గురైన పంటలను పరిశీలించి, రైతులకు, ప్రజలకు పలు సూచనలను చేయడం జరిగింది. ఈ తుఫాను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని విధాల సిద్ధంగా ఉందని, బాధితులు ఎవరు నిరాశ చెందవద్దని అన్నారు. రైతులకు, ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గొర్లి నానాజీ, ఆడారి యాద మూర్తి, జనసేన నాయకులు కర్రీ ఝాన్సీ, ఆడారి రమణబాబు, వార్డ్ అధ్యక్షులు ఎల్లపు శ్రీను, పందూరి శ్రీనివాసరావు, పిల్లా ఆదిబాబు, గొర్లి బాబురావు, బీసెట్టి చిన్నారావు, పట్టణ ఉపాధ్యక్షులు దంట్ల వెంకటస్వామి, కర్రీ స్వామి, ఎల్లపు గోపి, రాజా మహేష్ తదితరులు పాల్గొన్నారు.





## శారదా నది మధ్యలో చిక్కుకుపోయిన ముగ్గురిని రక్షించిన ఎన్డీఆర్ఎఫ్

**యలమంచిలి, జయ జయహే న్యూస్**

రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామ పరిధిలో శారదా నది మధ్యలో చిక్కుకుపోయిన ముగ్గురిని ఎన్డీఆర్ఎఫ్, ఫైర్, రెవెన్యూ సిబ్బంది, స్థానిక పోలీసులు కలిసి ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రెస్క్యూ చేసి సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. వారిని పరామర్శించిన కలెక్టర్ ఎలా చిక్కుకుపోయారని ప్రశ్నించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని బయటికి తీసుకొచ్చిన సిబ్బందిని అభినందించారు. వరద తగ్గుముఖం పడుతోందని అయినా ప్రజలు, కూటమి నాయకులు, అధికారులు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ హెచ్చరించారు. వరద నివారణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారుల సమన్వయం కృషితో వరద నష్టాన్ని నివారించగలిగామన్నారు.



## దేవాలయంలోకి చొచ్చుకొచ్చిన వరద నీరు

**అనకాపల్లి జయ జయహే**

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శారదా నది పొంగి పలు గ్రామాలు పంట పొలాలను ముంచి వేయడం జరిగింది అదేవిధంగా అనకాపల్లి శారదా నది ఒడ్డున గల ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో గత అర్ధరాత్రి వరద నీరు చేరి ముంపునకు గురైంది చుట్టుపక్కల స్థానికులు ప్రజలు వచ్చి ఈ వరద నీటిని చూసి ఈ కార్తీకమాసంలో శారద నది గంగా మాత శివుడిని తాకి పునీతం చేసిందని ప్రజలు మురిసిపోవడం జరిగింది. ఇంతలా వరద నీరు రావడానికి కూడా కారణం రై వాడ గేట్లు ఎత్తడంతో ఒక్కసారిగా వరద నీరు ఉధృతి పెరిగి నది ఒడ్డున ఉన్న గ్రామాలు పంట పొలాలు దేవాలయాలు, మునిగిపోవడం జరిగింది. అయితే ఎక్కడ ఎవరికి ప్రాణ నష్టం అంటూ జరగలేదు

## సీఎం సహాయనిధికి రూ.5 లక్షలు అందించిన గంటా రవితేజ

### తుపాను నేపథ్యంలో పుట్టినరోజు వేడుకలు రద్దు చేసుకున్న యువనేత

**భీమిలి,( జయ జయహే)**



సీఎం సహాయ నిధికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు, టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ రూ. 5 లక్షలు అందజేశారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను ఉండవల్లి నివాసంలో గురువారం కలిసి ఈ మేరకు చెక్కును అందించారు. మొంథా తుపాను రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపిన నేపథ్యంలో గురువారం తన పుట్టినరోజు వేడుకలను రవితేజ రద్దు చేసుకున్నారు. బాధితులను ఆదుకోవడానికి తన వంతు బాధ్యతగా నియోజకవర్గంలో పార్టీ యువతతో వచ్చి ఈ మొత్తాన్ని విరాళంగా ఇచ్చారు. అనంతరం "గీత మకరందం" ఆధ్యాత్మిక గ్రంథాన్ని లోకేష్ కు బహూకరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాల గురించి లోకేష్ ఆరా తీశారు. భీమిలి టీడీపీకి కంచుకోటని, కె.ఎస్.ఎస్.లు.. కమిటీలు.. విజయవంతంగా పూర్తి చేశామని రవితేజ తెలిపారు. లక్ష పైగా పార్టీ సభ్యత్వాలు నమోదు చేసిన విషయాన్ని లోకేష్ కు వివరించారు. యువత భాగస్వామ్యంతో పార్టీని మరింత పటిష్టం చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. రవితేజకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసిన లోకేష్.. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావాలని సూచించారు.

## బూసిపుట్టు పంచాయతీని యధావిధిగా కొనసాగించాలి



### ఆ ప్రాంతీయులు భారీ ఆందోళన

**ముంచంగిపుట్టు, జయ జయహే:**

మండలంలో గల మారుమూల బూసిపుట్టు పంచాయతీని ముంచంగిపుట్టు మండలంలో యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంతీయులు గురువారం పంచాయతీ కేంద్రంలో భారీ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. బూసిపుట్టు పంచాయతీని ముంచంగిపుట్టు మండలంలో కొనసాగించాలని, మద్దిగరువు మండలంలో విలీనం చేస్తే ఊరుకోమని పలు గ్రామాలకు చెందిన సుమారు 200 మందికిపైగా ప్రజలు ఫ్లకార్డులను చేతపట్టి సుమారు నాలుగు కిలోమీటర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం గా ఆ ప్రాంతీయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన మండలాల ఏర్పాటులో భాగంగా మద్దిగరువును మండల కేంద్రంగా ఏర్పాటు చేసి, అందులో ముంచంగిపుట్టు మండలానికి చెందిన బూసివుట్టు పంచాయతీని విలీనం చేసేం దుకు చూస్తున్నారని అన్నారు. దాని వలన బూసివుట్టు వంచాయతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని, పలు సమస్యలను ఎదుర్కోవలసి వస్తాదని. ప్రభుత్వం స్పందించి ఆ ప్రక్రియను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బూసి పుట్టు పంచాయతీ సర్పంచ్ కె.రాజమ్మ, మాజీ సర్పంచు వి.మంగలన్న, నాయకులు కె.నాగేశ్వరరావు, కె.సూరిబాబు, కె.సింహాచలం, డి.తిరుపతి, కె.రాజారావు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



# నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



### బాధితులను పరామర్శించిన వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు

**జంగారెడ్డిగూడెం, జయ జయహే**

మాంధా తుపాను మూలంగా పంట నష్టం అపారమని వరి రైతుకు ఎకరానికి రూ 30వేలు ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వై ఎస్ ఆర్ సి పి రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురు నాథ రావు కోరారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలోను, రూరల్ మండలంలోని పేరంపేట, పంగిడిగూడెం గ్రామాలలో గత మూడు రోజుల నుండి కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వరి రైతులను గురువారం జెట్టి పరామార్శించారు.. నీటి మునిగిన వరి పంట పొలాలను సందర్శించి పరామర్శించినవారికి ధైర్యం చెప్పారు.రైతులు తమ ఇక్కట్లు ఆయనకు తెలీశారు. ఈ సందర్భంగా గురునాథరావు మాట్లాడుతూ గత మూడు రోజుల నుండి మూంథా తుఫాను కారణంగా జంగారెడ్డిగూడెం మండలం లో విపరీతమైన భారీ వర్షాలు కారణంగా ఈ ప్రాంతంలో వరి పంట పొలాలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం జేశారు.వరి చేలు చాపలానేల పై పడిపోయి వాటిపైన నీరు పారలి ప్రవహిస్తున్నదని అనేక చోట్ల వరి కంకులు మొలకెత్తా యని అన్నారు. ఎకరానికి 50 బస్తాలు పండే పంట పొలాలు ధాన్యం చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాల కారణంగాచేలు పూర్తిగా నేలమట్టం అయ్యా యని విచారం వేలి బుచ్చారు. కనీసం 15 బస్తాలు చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది జంగారెడ్డిగూడెం మండలంలో 475 ఎకరాలు మాత్రమే నేటి మునిగాయని ప్రకటిస్తున్నట్లుగా తెలియ వచ్చిందని వాస్తవానికి కొన్ని వేల ఎకరాలు నీట మునిగి వరి పంటలు పూర్తిగా నష్టపోయాయని జెట్టి తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎకరానికి 30 వేల రూపాయలు పంట నష్టంగా ఇస్తే తప్ప రైతులకు న్యాయం జరగదని అన్నారు. గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి పంట పొలాలకు ఇన్సూరెన్స్ ప్రభుత్వమే కట్టేదని కానీ నేడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఇన్సూరెన్స్ ను చెల్లించకుండా రైతులు పైనే ఆ భారాన్ని పెట్టడ%శీ% వలన రైతులు ఇన్సూరెన్స్ కట్టుకోలేని పరిస్థితి ఉదని తెలిపారు.నిజానికి ప్రభుత్వమే ఆ ఇన్సూరెన్స్ కట్టి ఉంటే ఈనాడు రైతులకు కొంత వెసులుబాటు కలిగి ఉండేదని తెలిపారు. ప్రస్తుతం ఈ నష్టం ఎవరు భరిస్తారు?ఎవరు బాధ్యత వహిస్తారు?, అని ప్రశ్నించారు. ప్రభుత్వమే ఆ ఇన్సూరెన్స్ కట్టి ఉంటే రైతులకు కొంత సాయం అందేదని ప్రభుత్వం ఇన్సూరెన్స్ కట్టని కారణంగా ఈ నష్టాన్ని ప్రభుత్వమే భరించి పంట నష్టం జరిగిన రైతులకు వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకుపరిహారం ఇవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు, పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్పూరం గౌరయ్య గుప్తా, సీనియర్ నాయకులు బత్తిన చిన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు కౌన్సిలర్స్ నేకూరి కిషోర్ ఉగ్గం ప్రసాదు మాజీ వార్డ్ మెంబర్ పిండి రాము, పల్లా రమణ గగ్గల కిరణ్ కుమార్ రైతులు కొత్తూరు భద్రయ్య కొత్తూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.





# శారదా నదికి రెండు చోట్ల గండి

### ముంపు ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**యలమంచిలి, జయ జయహే న్యూస్**

రాంబిల్లి మండలంలో మైనర్ శారదా నదికి రెండు చోట్ల గండిపడడంతో పలు గ్రామాలలోకి నీరు చేరడంతో పాటు వందలాది ఎకరాల పంట భూములు ముంపుకు గురయినాయి. ముంపు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తో పాటు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమారులు పరిశీలించారు. రాంబిల్లి మండలం వైలోవ గ్రామ సమీపంలో మేజర్ శారదా నదికి గండిపడి గ్రామంలోకి వరద నీరు చేరింది. పంట పొలాలు మధ్య వరద నీటిలో చిక్కుకున్న ముగ్గురిని ఎస్డిఆర్ఎఫ్ బృందాలు బోటులో వెళ్లి రక్షించారు. నారాయణపురం గ్రామ సమీపంలో మైనర్ శారదా నదికి గండిపడడంతో సమీపంలోని పంట పొలాలు ముంపుకు గురయినాయి. రాంబిల్లి మండలంలో ముంపుకు గురైన ప్రాంతాలను పంట పొలాలను జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే తో కలిసి పరిశీలించి మరింత ప్రమాదం చోటు చేసుకోకుండా ఇసుక బస్తాలను గండిపడుతున్న చోట ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది ఇంతకుముందు లేని విధంగా వ్యవసాయ పనులకు అధిక పెట్టుబడులు పెట్టాల్సి వచ్చిందని తుఫాను మావంటి పేద రైతులు పట్ల విరుచుకు పడడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైనర్ మేజర్ శారదా నదుల పరివాహక ప్రాంతాలలో ముందస్తు చర్యలు చేపట్టి అధికారులు పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తున్నారు.

# "వెలుగు" ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





**రాజమహేంద్రవరం , జయజయహే:**

స్థానిక 13వ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో మాజీ కార్పొరేటర్, డివిజన్ ఇన్‌ఛార్జ్ కప్పల వెలుగు కుమారి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పుట్టిన రోజును పురస్కరించుకుని భాను తేజస్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, రేవతి హాస్పటల్ సంయుక్త సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు కప్పల వెలుగు కుమారి తెలిపారు. తాము నిర్వహించిన వైద్య శిబారానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని, తమ డివిజన్ నుంచి దాదాపు 350 మంది పేదలు వచ్చి వివిధ వైద్య పరీక్షలు చేయించుకోగా, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందచేశామన్నారు. తమ ప్రాంత ప్రజల కోసం భవిష్యత్తులో తాము మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశీ నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకి రామయ్య. మహ్మద్ అబ్దుల్లా, మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియ, తురకల నిర్మల, మీసాల నాగమణి, కర్ణం లక్ష్మీ నాయుడు, అప్సరి, శ్రీలత, స్వర్ణ, కోన సత్య, నగరబోయిన రామకృష్ణ, మల్లెల శ్రీనివాస్, కనక దుర్గ తదితరులు పాల్గొన్నారు.



# ప్రధాన రోడ్డుపై పొంగిన శేషు గడ్డ

### రాకపోకలకు అంతరాయం

**యలమంచిలి, జయ జయహే న్యూస్**

యలమంచిలి పట్టణ సమీపంలోని శేషు గడ్డ పొంగి వరద నీరు ప్రధాన రోడ్డుపై నుంచి ప్రవహించింది. శేషు గడ్డ వరద నీరు మెయిన్ రోడ్డు పై ప్రవహించడంతో వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. గురువారం ఉదయం శేషు గడ్డ వరద ఉధృతి పెరగడంతో ప్రధాన రోడ్డు మీదగా ఎప్పటిలాగానే ప్రవహించింది. దీంతో అనకాపల్లి నుంచి యలమంచిలి వేపు రాకపోకలు సాగించే వాహనాలను కొంత సమయం పాటు నిల్వ వేశారు. శేషు గడ్డ పొంగిన ప్రదేశాన్ని చైర్పర్సన్ పిల్ల రమాకుమారి పరిశీలించారు.



## తుఫాను కారణంగా రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు

**యలమంచిలి, జయ జయహే న్యూస్**

మండలంలోని పంటలలో తుఫాను యొక్క ఉధృతిని గమనించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటించారు. గురువారం వ్యవసాయ పరిశోధనా స్థానం, కొక్కిరాపల్లి శాస్త్రవేత్త డాక్టర్ ఏబీయం (ప్రజనన శాస్త్రం), మండల వ్యవసాయాధికారి ఏ ఓ. మోహన్ రావు కలిసి వరి పొలాలను సందర్శించారు. ఈ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక వర్షాలకు వరి చేనులో ఉన్న నీరుని చేరిన నీటిని తీసివేయాలని, నీటిని తీసిన తరువాత యూరియా 30 కేజీలు మ్యురేట్ ఆఫ్ పొటాష్ ఒక 15 కేజీలు ఎకరానికి వెయ్యాలని అన్నారు. వరి పొలాల్లో ఆకు ముడత ఉధృతంగా కనిపిస్తోందని, ఆకు ముడత సోకిన పొలాలకు కార్తాఫ్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 8 కేజీలు ఇసుక 10 కేజీలతో కలిపి చల్లుకోవాలని తెలిపారు. వరి పొలాల్లో అగ్గి తెగులు గమనించడం జరిగిందని, అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజాల్ 0.6 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని అన్నారు. ఈ వర్షాలకు మానుపండు తెగులు వరిలో వచ్చే అవకాశం ఉంది కాబట్టి మాను పండు తెగులు నివారణకు ప్రొపికానజాల్ ఒక మిల్లీ లీటరు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని, ఈ వాతావరణానికి పొడ తెగులు వచ్చే అవకాశం కూడా ఉంది కాబట్టి పొడ తెగులు గమనించిన ఎడల హెక్సాకొనజోల్ 2 రెండు మిల్లీలీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని అన్నారు. వరి పొలాల్లో దోమ వచ్చే అవకాశాలు ఉన్నాయి కాబట్టి సుడిదోమ ఉధృతిని కూడా వరి పొలాల్లో గమనించుకోవాలని, పొట్ట దశలో ఉండే వరి పొలాలలో సాయంకాలం పూట మందులు పిచికారి చేసుకోవాలని తెలిపారు. సందర్శించిన గ్రామాలు యలమంచిలి మండలంలోని యలమంచిలి, కట్టుపాళెం, సోమలింగపాలెం, రామారాయుడు పాలెం గ్రామాలు సందర్శించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అభ్యుదయ రైతులతో పాటుగా గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## రామారాయుడుపాలెం వెళ్లే దారిలో కల్వర్టు నిర్మించండి

### గొర్లె బాబురావు

**యలమంచిలి, జయ జయహే న్యూస్**



మున్సిపాలిటీ పరిధిలో గల రామారాయుడుపాలెం వెళ్లే దారిలో కల్వర్టు అకాల వర్షానికి పూర్తిగా దెబ్బతింటుందని 24వ వార్డు టిడిపి అధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొర్లె బాబురావు అన్నారు. బుధవారం రాత్రి నుండి కురుస్తున్న వర్షాలకు శేషు గడ్డ పొంగడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ రోడ్డు నుండి సుమారు 15 గ్రామాల ప్రజలు ఈ రోడ్డుగుండ రాకపోకలు సాగించాలని కావున అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు.

# సిటీలో కూటమి నేతల ఐక్యతకు నిదర్శనం ఎండోమెంటు కమిటీలు



**- హితకారిణి చైర్మన్‌గా డాక్టర్ యాళ్ళ ప్రదీప్ సుకుమార్**

**కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా కొయ్యల రమణ**

**- పుష్కరాల నాటికి దేవస్థానాలు అభివృద్ధి చేసి భక్తులకు సదుపాయాలు కల్పించాలి**

**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, జయజయహే :**

రాజమండ్రి సిటీలో ప్రతిష్టాత్మక హితకారిణి సమాజం ట్రస్టు చైర్మన్ గా డాక్టర్ యాళ్ళ ప్రదీప్ సుకుమార్, శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా కొయ్యల రమణ నియమితులయ్యారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ( వాసు) ప్రకటించారు. తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయంలో గురువారం కమిటీలను ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ చైర్మన్లతో పాటు కూటమి లోని టీడీపీ జనసేన బీజేపీ వారితో మొత్తం 11 మంది వంతున సభ్యులను నియమించామని చెప్పారు. రాజమండ్రి నగరంలోని 14 ఎండోమెంటు కమిటీలు ఉండగా ఇంతవరకు 12 కమిటీలు వేశామని, త్వరలో చందా సత్రం, శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్లు, సభ్యులను నియమిస్తామని ఆయన తెలిపారు. రాజమండ్రి క్షేత్రపాలకుడు శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్ ను నియమించినా పునః పరిశీలనకు వెళ్ళిందని ఆయన వివరించారు. ఇప్పుడు నియమించిన ఈ రెండు కమిటీలు నవంబరులో ప్రమాణ స్వీకారం చేస్తాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేనివిధంగా ముందుగా రాజమండ్రి సిటీలో ఎండోమెంటు కమిటీలను వేసుకోవడం జరిగిందని, కూటమి లోని టీడీపీ జనసేన బీజేపీ నాయకులంతా ఐకమత్యంతో ,సఖ్యతతో ఒకే మాటమీద ఉండడంతో ఇది సాధ్యమైందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. ఈ కమిటీల నియామకంలో సహకరించిన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జనసేన సిటీ ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ, కార్పొరేషన్ అధ్యక్షుడు వై.శ్రీను, టీడీపీ కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఎండోమెంటు కమిటీలు వేస్తున్నామని, దేవస్థానాలు అభివృద్ధి చేసి, వాటి ఆస్తులను పెంచాలని, పుష్కర యాత్రికులు, భక్తులకు సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించారు. తద్వారా చైర్మన్లు, సభ్యులు వ్యక్తిగతంగా కూడా బాగా చేశారనే విధంగా మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

**హితకారిణి సమాజం సభ్యులు వీరే :**

ఆదిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, మేడపాటి సాయి భాగ్యలక్ష్మి, కూచర్లపాటి లలితా రాణి, గుణ్ణం శ్యామ్ సుందర్, చెరుకుమల్లి అనంత సత్య నాగవల్లి, కొడమళ్ళ శ్రీనివాసరావు, మంచెం విజయకుమార్, తణుకు శేష కుమారి, కిలారి వెంకట నాగలక్ష్మి ఉన్నారు.

**కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం సభ్యులు:**

పిల్లి ప్రసాద్, జొన్న సత్యవతి,%అ% అలజంగి దేవుడు, నిమిషకవి వెంకటేశ్వరరావు, గుబ్బల గంగా భవాని, జి.వి.ఆర్.రెడ్డి, తోట కిరణ్ ముద్దుకూరి అనురాధ, ముంగండ త్రివేణి, సమ్మంగి లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

# "విద్యుత్ మీటర్ల" మాయాజాలం?







**అ'ధన'పు మీటర్లు.......కోకొల్లలు...?**

**'ఎపిఇపిడిసిఎల్ 'కు "షాక్" ఇస్తున్న అధికారి....?**

**స్తంభాలు మార్పులోను చేతివాటమే ...?**

**అధికారి 'ఇ పి సి సి బి లాగిన్'తెరిస్తే బయట పడనున్న బాగోతం.....?**

**సంస్థ ఆదాయానికి భారీ గండి....?**

**చోద్యం చూస్తున్న సీనియర్, డివిజనల్ అధికారులు.....?**

**కానరాని ఏసీబీ...విజిలెన్స్ జాడ...?**

**గాజువాక,జయజయహే :**

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ జోన్-2,శ్రీహరిపురం విద్యుత్ ఉప ప్రాంతీయ కార్యాలయం కేంద్రంగా అమ్యామ్యాలకు అలవాటు పడ్డ ఓ విద్యుత్ అధికారి 'ఎ పి ఇ పి డి సి ఎల్' నిబంధనలను కాలరాస్తూ 20కిలో వాట్స్ విద్యుత్ వినియోగం దాటిన బహుళ, అంతస్తులకు,గ్రూప్ హౌస్లకు, వ్యాపార సముదాయలకు, పెంట్ హౌస్ లకు అ'ధన'పు విద్యుత్ మీటర్లు మంజూరు పై జరిగిన అవినీతి అక్రమాలు ప్రముఖ దిన పత్రిక "జయజయహే" లో వారం రోజులుగా పుంకాలు...పుంకాలుగా కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో మరిన్ని గృహాలకు,గ్రూప్ హౌస్ లకు బహుళ అంతస్తులకు,వ్యాపార సముదాయాలకు,పెంట్ హౌస్లకు ఆ అధికారి మంజూరు చేసిన అ'ధన'పు మీటర్లు కోకొల్లలుగా బయట పడడం పై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జవహర్ నగర్,బర్మా కాలనీ,రామ్ నగర్,పిలకవాని పాలెం,శ్రీహరిపురం,ఎక్సర్వీస్ మెన్ కాలనీ,ఇందిరా కాలనీ,వుడా కాలనీ,శ్రీనివాస నగర్ ఇలా శ్రీహరి పురం సబ్ స్టేషన్ పరిధిలో అధనపు మీటర్లు ఏర్పాటులో భారీ ముడుపులు చేతులు మారినట్లు కొంతమంది సిబ్బందే చెవులు గోకుంటున్నారు. పోల్ నెం..8/బి/3/2,లో విద్యుత్ మీటర్ నెంబర్లు1111911152000548, 1111911152001781, 1782, 1783, 1784, 1785, 1311, 1312, 1793....బర్మా కాలనీ డోర్ నెం.. 63-1-89.....పోల్ నెం 276/ఎ2/2 లో 1111911151006053, 1111911151015902, 15903, 15901, 15900, 15901, డోర్ నెంబర్ 65-5-, పోల్ నెం: 9/ఎ /2/1లో 1111911152000838,1111911152000407, 1111911152001790, 1111911152001788, 1111911152001787, 1111911152001786, 1111911152001789 మీటర్స్ ఏర్పాటులో భారీగా సొమ్ములు వండి వర్చేసినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

**విద్యుత్ స్తంబాలు మార్పులోను చేతివాటం....**

ధన దహానికి అడ్డు అదుపు లేకుండా సంస్థ ఆదాయానికి గండికొడుతూ వినియోగదారులకు చుక్కలు చూపించే ఆ అధికారి సంస్థ విద్యుత్ స్తంబాలను మార్చటంలోనూ చేతి వాటం ప్రదర్శించినట్లు గుసగుసలు వినబడుతున్నాయి. ఏ కారణం చేతనైనా విద్యుత్ స్తంబాలు మార్చవలసిన పరిస్థితి వస్తే..ఆ కారణాన్ని చూపుతూ సంస్థ ఖజానాకు తగిన 'చలాన' కట్టి అధికారికంగా విద్యుత్ స్తంభాలు మార్చవలసి ఉంటుంది. కానీ చాలా చోట్ల ఈ నిబంధనలు గాలికొదిలేసి వినియోగదారుల అవసరాలను సొమ్ము చేసుకున్నట్లు విద్యుత్ స్తంభాలే కోడై కూస్తున్నాయి. ఈ వ్యవహారంలో భారీగా గుంజినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నెహ్రూనగర్ ప్రాంతంలో ఓ వినియోగదారునికి మేలు కోసం అక్కడ ఉన్న విద్యుత్ స్తంభాన్ని (140/బి/5) మార్చి సొమ్ములు పోగేసుకున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బర్మా కాలనీ దర్గాదేవి టెంపుల్ సమీపంలో విద్యుత్ స్తాంభాన్ని (276,/ఎ/4) వినియోగ దారునికి మేలు జరిగేలా మార్చి లక్ష కు పైగా నొక్కేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 65ట్రాన్స్ఫార్మర్ వాటర్ ప్లాంట్ వీధిలో 65/బి/2/2 కి అనుబందంగా వినియోగదారునికి మేలు కోసం కొత్త స్తంబాన్ని ఏర్పాటు చేసి 60వేలు పైగా నొక్కేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇలా ప్రతీ చోట..ప్రతీ పనిలోనూ కక్కుర్తి పడినట్లు వాదన బలంగా వినబడుతుంది.



**అధికారి ఇ పి సి సి బి లాగిన్ ఓపెన్ చేస్తే.....**

ఆ అధికారి పాస్ వర్డ్ ద్వారా ఇ పి సి సి బి లాగిన్ తెరిస్తే ఆ అధికారి 2024 అక్టోబర్ లో బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు మంజూరు చేసిన అధనపు మీటర్స్, ఎంత కిలో వాట్ మీటర్స్,ఏ డోర్ నెం లో....ఎ వినియోగదారునికి అమర్చారో మొత్తం అవినీతి,అక్రమాలు బయట పడడం ఖాయం అని సంస్థకంప్యూటర్లే గుసగుసలాడుకుంటున్నాయి. ఈ బండారం ఎక్కడ బయట పడుతుందో అని తన పాస్ వర్డ్ కోడ్ ఆ అధికారి మార్చినట్లు ప్రచారం. ఎన్ని జిమ్మిక్కులు చేసిన,చట్ట పరంగా చర్యలు తీసుకుంటే శ్రీ కృష్ణని జన్మస్థలానికి ఆ అధికారి చేరుకోవడం ఖాయమని పలు ప్రజా సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**మీన మీసాలు లెక్కపెడుతున్న సీనియర్, డివిజనల్ అధికారులు.......**

సంస్థ ఖజానాకు అంత పెద్ద కన్నం పడితే పై అధికారులు ఆ అధికారిపై చర్యలు తీసుకోకుండా చోద్యం చూడడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో ఆ అధికారి పై ఎందుకు చర్యలు తీసుకోలేదని కొంతమంది ప్రశ్నిస్తున్నారు. ఆ అధికారికి సంస్థ లో ఓ ఉన్నతస్థాయి అధికారి కొమ్ము కాస్తుండడం వలనే చర్యలకు మీన మీసాలు లెక్కపెడుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో వారి పాత్ర పై అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వారు కుర్చీకే పరిమితం కావడం వెనుక వారికి వాటాలు లేకపోలేదనే వాదన లేకపోలేదు.

**కానరాని ఏసీబీ...విజిలెన్స్ జాడ.....?**

విచ్చలవిడిగా నిబంధనలకు తూట్లు పొడుస్తూ...సంస్థ ఖజానాకు కన్నం పెడుతున్న ఆ అధికారి పై అవినీతి నిరోధక శాఖ,విజిలెన్స్ నిఘా జాడ లేకపోవడంతో అసలు అధికారులు ఉన్నారా...? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంస్థ ఆదాయానికి చిల్లులు పెడుతూ వినియోగదారునికి చుక్కలు చూపిస్తున్న అధికారిపై నిఘా,ఏసీబీ ఒక లుక్ వేయాలని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలుప్రజాసంఘాలు కోరుతున్నాయి.



# మొంథా తుఫాన్ ఎఫెక్ట్

**అరకులోయ: జయ జయహే.**

అల్లూరి జిల్లా అరకు వేలి మండలం మదల పంచాయతీ దాబుగుడ గ్రామం లో ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా. అతివేగంగ వెదురు గాలి వలన పై రేకు లేకపోవడం కారణంగా. గుబయి అర్జున్ భార్య పేరు రాధా అనే మట్టి గోడ ఇల్లు కూలిపోవడంతో వారిపై ఏ ప్రాణ హాని జరగలేదు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి తమపై ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కుమిలి రమేష్. పెసా కమిటీ కార్యదర్శి గురుమూర్తి. స్థానిక అవార్డు మెంబర్ సొన్ను. భగత్ రామ్. రాము. సింహాద్రి. జగనాదం. మోస్య తదితరులు పాల్గొన్నారు



# భారీ వర్షాల కారణంగా పాడేరు-విశాఖపట్నం ఘాట్ రోడ్డు మూసివేత

**కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం**

**పాడేరు,జయజయహే అక్టోబర్ 30:**

మొంత తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా, పాడేరు-విశాఖపట్నం ఘాట్ రోడ్డుపై గురువారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడ్డాయి. కొండపై నుంచి పెద్ద పెద్ద రాళ్లు రోడ్డుపై పడటంతో ఈ మార్గంలో ట్రాఫిక్‌కు పూర్తిగా అంతరాయం కలిగింది. ఈ ఘటనతో అప్రమత్తమైన అధికారులు, ప్రయాణీకుల భద్రత దృష్ట్యా ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేశారు.

ఈ పరిస్థితిపై పాడేరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.వి.ఎస్ లోకేశ్వర రావు మీడియాకు వివరాలు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు, పోలీసు, రెవెన్యూ, మరియు ఆర్ అండ్ బి శాఖల సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

రోడ్డుపై పడిన రాళ్లు, మట్టిని తొలగించి, ట్రాఫిక్ అంతరాయం లేకుండా తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్లియరెన్స్ పనులను పూర్తి చేసి, ముందుగా రోడ్డు క్లియరెన్స్ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొండచరియలు విరిగిపడటం వల్ల రోడ్డు కొంతమేర దెబ్బతింది. దీనిని కూడా వెంటనే పునరుద్ధరించాలని అధికారులు నిర్ణయించారు. ఆర్అండ్బి డిపార్ట్‌మెంట్ రోడ్డును పూర్తిగా పునరుద్ధరించిన తర్వాతే బస్సుల ప్రవేశానికి అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. రాళ్లు మళ్లీ పడే ప్రమాదం ఉన్నందున, ప్రయాణీకులు సహకరించాలని, అధికారులు మార్గాన్ని సురక్షితంగా పునరుద్ధరించే వరకు ఈ ఘాట్ రోడ్డుపై ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని ఆర్.డి.ఓ కోరారు.



# ప్రతిమాసము ఒక సందేశమే

**గౌరు చరితమ్మ, పాణ్యం శాసనసభ్యులు.**

**శివరామాలయంలో ప్రారంభమైన ధార్మిక సప్తాహం**

**కర్నూలు జయ జయహే**

మానవజన్మను చరితార్థం చేసుకొనుటకు ప్రతి మాసము ఒక సందేశమేనని, ప్రతి మనిషికి నియమనిష్టలు ఎంతో అవసరమని, మానవుడు బుద్ధిజీవిగా జీవించాలంటే సత్సంగత్వం ఎంతో అవసరమని, ప్రతి మానవుడు తనశక్తికొలది దానధర్మాది క్రతువులు నిర్వహించాలని పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితమ్మ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మాధవనగర్ లోని శ్రీశివరామాలయం నందు ధార్మిక సప్తాహాన్ని వారు జ్యోతి ప్రజ్వలనచేసి ప్రవచించారు. మొదటిరోజు ప్రవచనంలో భాగంగా డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని కార్తిక మాస విశిష్టత, దీప, దాన, ఉపవాస మహిమలను గురించి సోదాహరణంగా వివరించి భక్తులను ఆలోచింపచేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు జి.శేషాచలం, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, బాలాజీ సేవాట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు వేమారెడ్డి ధనంజయరెడ్డి, వార్డు ఇన్చార్జి రఘునాథ్ రెడ్డి, జనార్ధన రెడ్డి, తితిదే హిందూ ధర్మ ప్రచారమండలి సభ్యులు అంబటి శివశంకర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

For a pure tomorrow..
జయహే

## జిల్లాలో గంజాయి రవాణా అరికట్టడానికి

# పక్కా ప్రణాళికలు తయారు చేయండి





**గంజాయి నివారణకు కీలక పనితీరు సూచికలు తప్పనిసరిగా పాటించాలి**

**ప్రతి మండలానికి యూత్ క్లబ్ ఏర్పాటు చేయాలి**

**జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్**

**పాడేరు జయజయహే అక్టోబర్ 30:**

జిల్లాలో గంజాయి రవాణా అరికట్టడానికి పక్కా ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో పోలీస్, వ్యవసాయ శాఖ, అటవీశాఖ, ఉద్యాన, వైద్య, విద్య, ఐ సి డి ఎస్, డిఆర్డిఏ, ట్రైబల్ వెల్ఫేర్, ఎక్సైజ్, బ్యాంక్, సిపిఓ అధికారులతో గంజాయి నిర్మూలన కు వివిధ శాఖల కార్యకలాపాలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న కార్యాచరణ ప్రణాళిక అంశాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి జిల్లా నుండి గంజాయి రవాణా చేయడం చాలా కష్టం అనే పరిస్థితిని తీసుకురావాలని పేర్కొన్నారు. జిల్లా లో ఏ ప్రాంతాల నుండి ఎక్కువ గంజాయి రవాణా అవుతుందా అని ఆరా తీశారు. ప్రతి నెల నిర్వహించే సమావేశానికి పూర్తి కీలక పనితీరు సూచికల డేటాతో రావాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. గంజాయి పంట మీద ప్రజల అభిప్రాయ సేకరణ తీసుకున్నారా అని ఆరా తీశారు. గంజాయి పంటకు బదులుగా ప్రత్యమ్మాయ పంటలు ఎంతమంది రైతులకి ఇచ్చారని ఆరా తీశారు. జిల్లాలో వన్నరబుల్ గ్రామాలు మీద ఎక్కువ దృష్టి పెట్టాలని సూచించారు. పాఠశాలల్లో, కాలేజస్ లో ఫిర్యాదులు బాక్స్ పెట్టారాని, ఫిర్యాదులు ఏమైనా వచ్చాయా అని ఆరా తీశారు. వారానికి ఒకటి లేదా రెండు సెషన్స్ క్లాస్ రూమ్ లో పెట్టాలని సూచించారు. యువత గంజాయి పండించే వైపు ఆకర్షిస్తున్నా కారణాలు వైద్య బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. డిగ్రీ, ఇంటర్ కళాశాలలో, ఆశ్రమ పాఠశాల, కేజీబీవి పాఠశాలలో క్రీడా ఆధారిత ప్లాన్స్ తయారు చేసి విద్యార్థుల ఖాళీ సమయంలో నిమగ్నమై ఉంచాలని ఆదేశించారు. విద్యాసంస్థల్లో స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ప్రవర్తన పై ప్రజెంటేషన్ మాడ్యూల్స్ తయారుచేసి పాఠశాల మరియు కాలేజ్ ఉపాధ్యాయులు గ్రహించేలా సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో యూత్ క్లబ్ ఏర్పాటు చేసి యువతను పాజిటివిటీ వైపు నడిపించే దిశగా నిమగ్నం చేయాలని సూచించారు. ఆదివాసి సేవా కేంద్రాల సిబ్బందికి గంజాయి సాగు, రవాణా గుర్తించేలాగా శిక్షణ ఇప్పించాలని గిరిజన సంక్షేమ శాఖకు ఆదేశించారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ గంజాయి సాగు చేసిన, రవాణా చేసిన వారి మరియు బంధువుల స్థిర ఆస్తులు జప్తు చేస్తామని తెలిపారు. సమాజంలో మార్పు రావాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన గంజాయి స్మగ్లర్లకు ఆశ్రయం కల్పించడం నేరమని అన్నారు. బ్యాంకులు నిరుద్యోగులు అతి పెద్ద మొత్తం లో నగదు జమ చేసిన నిఘా పెట్టాలని పేర్కొన్నారు. గంజాయి సాగు చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలనిఅటవీ శాఖను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బి ఎస్ నంద్, జిల్ లీడ్ బ్యాంకు మేనేజర్ మోతు నాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి పై బ్రహ్మాజీ, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పరిమళ, జిల్లా ఉద్యాన అధికారి కే బి కర్ణ, పాడేరు రంపచోడవరం చింతూరు ఫారెస్ట్ అధికారులు, ఏపీవో పి టి జి ఎం వెంకటేశ్వర్లు తదితర జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# "ఆస్పైర్ ఫర్ హర్" వైజాగ్‌కు రానుంది





**విశాఖపట్నం, జయ జయహే**

విశాఖపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (విసిసిఐ) మహిళా విభాగంతో కలిసి ఉత్తేజకరమైన ఉద్యోగ అవకాశాలు, అత్యాధునిక నైపుణ్య వనరులను, నిపుణుల మార్గదర్శకత్వాన్ని మరియు కెరీర్ అవకాశాలను మెరుగు పరచడానికి శక్తివంతమైన వేదికను తీసుకువచ్చే ఇన్‌స్పైర్ ఫర్ హర్ సంస్థ విశాఖపట్నంలో ఒక పారిశ్రామిక మహిళా వ్యవస్థాపకుల సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో విసిసిఐ మహిళా విభాగం, ఆంధ్ర ప్రదేశ్ చాంబర్స్, క్రెడాయ్ మహిళా విభాగం మరియు వివిధ ఇతర వ్యాపార భాగస్వామ్యంతో దాదాపు 30 మంది మహిళా వ్యవస్థాపకులు పాల్గొన్నారు. వ్యవస్థాపకతలో మహిళల పెరుగుతున్న పాత్ర మరియు వ్యాపార విజయగాథలను సృష్టించడంలో సహకార శక్తిని పెంపొందించేలా చేసిన విసిసిఐ మహిళా విభాగం చైర్‌పర్సన్ శ సంధ్యా గొడే ప్రసంగంతో సమావేశం ప్రారంభమైంది. ఆస్పైర్ ఫర్ హర్ వ్యవస్థాపకురాలు మరియు సి ఇ ఒ మధుర దాస్ గుప్తా, సంస్థ యొక్క స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని మరియు మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఇది సృష్టిస్తున్న ప్రభావాన్ని పంచుకున్నారు. ఆమె ఆస్పైర్ ఫర్ హర్ కింద వివిధ కమ్యూనిటీల గురించి మాట్లాడారు, ఇవి వృత్తిపరమైన వృద్ధి, నాయకత్వం మరియు వ్యవస్థాపకతపై దృష్టి సారించాయి. ఆమె 'ప్రాజెక్ట్ నవేలి' చొరవ ద్వారా ఆస్పైర్ ఫర్ హర్‌ను ప్రమోట్ చేసే నవ్య నవేలి నందా సహకారాన్ని కూడా హైలైట్ చేసింది. వారు కలిసి, మహిళలు నేతృత్వంలోని వ్యాపారాలను ప్రదర్శించే మరియు వారి వ్యవస్థాపక స్ఫూర్తిని జరుపుకునే వేదిక అయిన ఎంటర్‌ప్రెనారిని సృష్టించారు. సమావేశంలో, వారి సంబంధిత రంగాలలో ప్రభావం చూపిన కొంతమంది మహిళా సాధకులను గుర్తించి సత్కరించారు. ఈ కార్యక్రమం ఆలోచనలను పంచుకోవడానికి, సంబంధాలను నిర్మించుకోవడానికి మరియు స్ఫూర్తిదాయకమైన సహకారానికి అర్థవంతమైన వేదికగా పనిచేసింది. విశాఖపట్నం నుండి మరి కొంత మంది మహిళలు ఒకరితో ఒకరు సహకరించుకోవాలని మరియు సాధికారత, మార్గదర్శకత్వం మరియు వ్యాపార వృద్ధికి కట్టుబడి పెరుగుతున్న సమాజంలో భాగం కావాలని నిర్వాహకులు ప్రోత్సహించారు.

## శ్రీ సత్య సాయి బాబా

# శత వర్ష జన్మదినోత్సవాల్లో పాల్గొనండి

**ఆర్ లక్ష్మణ రావు**

**విశాఖపట్నం జయ జయహే**

నవంబర్ నెలలో రాబోయే భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి శత వర్ష జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా రైల్వే ఏరియా తాటిచెట్లపాలెం భజన మండలి నూతన శ్రీ సత్య సాయి మందిరం ఆనంద నిలయం ను ఆంధ్ర ప్రదేశ్ శ్రీ సత్య సాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు ఆర్ లక్ష్మణ రావు ప్రారంభించారు. వేదం పఠనం, భజనల అనంతరం భక్తుల నుద్దేశించి మాట్లాడుతూ, తన ఆధ్యాత్మిక ప్రసంగం లో ఆర్ లక్ష్మణ రావు దీనుల సేవలో సేవించి తరిస్తున్న తాటిచెట్లపాలెం భజన మండలి శ్రీ సత్య సాయి భక్తులను అభినందించారు. "అందరినీ ప్రేమించు"- అందరినీ సేవించు" అన్న భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి దివ్య సందేశం తో ప్రేరణ కలిగి లక్షలాది మంది భక్తులు విశ్వవ్యాప్తంగా 150 పైగా దేశాల్లో నిస్వార్థ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. నవంబర్ నెలలో రాబోయే భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి శత వర్ష జన్మదినోత్సవ వేడుకల్లో పుట్టపర్తిలో పాల్గొనడానికి దేశ,



విదేశాల్నించి విశిష్ట అతిధులు, లక్షలాది మంది భక్తులు పాల్గొనబోతున్నారని, అందరికీ శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మరియు భారత దేశం శ్రీ సత్య సాయి సేవా



సంస్థలు తగిన ఏర్పాట్లు చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఈ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత వర్ష జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని ఆర్ లక్ష్మణ రావు ఆహ్వానించారు. నిస్వార్థ సేవలో పాల్గొంటున్న శ్రీ సత్య సాయి భక్తులు ప్రతి ఒక్కరూ ధన్యులని ఆర్ లక్ష్మణ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో శ్రీ సత్య సాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షులు పి ఆర్ ఎస్ యెన్ నాయుడు, శ్రీ సత్య సాయి సేవా సంస్థల పదాధికారులు, అనేక మంది భక్తులు పాల్గొన్నారు.



# బొండ కొండమ్మకు అండగ ఉందం

**తుఫాన్ బాధితురాలికి నిత్యావసరసరుకులు అందజేసిన సురేష్ కుమార్**

మూంథ తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా ఇల్లు గోడాలు కూలిపోవడంతో పాడేరు మండలం గుత్తులపుట్టు పంచాయతీ పామిరెల్లి గ్రామానికి చెందిన బొండ కొండమ్మకు తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ పరామర్శించి బియ్యం,నూనె,కాయగూరలు అందించటం జరిగింది.అలాగే ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకొంటుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ లు కొంతెలి వెంకట ప్రసాద్,తామర మూర్తిబాబు, (కె ఎస్ ఎస్) వి రమేష్ ,సత్తిబాబు,రాము తదితరులు పాల్గొన్నారు.



# జేఎన్టీయూ గురజాడను అభివృద్ధి చేయండి

**డాక్టర్ సుంకరి రమణమూర్తి**

**విజయనగరం జయ జయహే**

జేఎన్టీయూ గురజాడ విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ గా నియమితులైన ఆచార్య వి వి సుబ్బారావు ని ఆయన చాంబర్ లో ఉత్తరాంధ్ర విద్యార్థి సేన తరపున ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి విశ్వవిద్యాలయ పరిస్థితులను వీ సీ కి వివరిస్తూ, 2007లో ఎక్స్టెన్షన్ సెంటర్ గా ఏర్పడిన జేఎన్టీయూ గురజాడ విశ్వవిద్యాలయం అనేక ఆటుపోట్లకు గురయిందని, విద్య పరంగా పరిపాలనపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. గతంలో విశ్వవిద్యాలయంలో జరిగిన అనేక అవినీతి అక్రమాలపై ఉత్తరాంధ్ర విద్యార్థి సేన పోరాటం చేసిన విషయాలను గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న ఏకైక సాంకేతిక విశ్వవిద్యాలయం ఇదొక్కటేనని, దీనిని అభివృద్ధి పరచాల్సింది పోయి స్వార్థపూరిత ఆలోచనలతో గత పాలకులు తీసుకున్న అవినీతి నిర్ణయాలతో విశ్వవిద్యాలయ ప్రతిష్ట దిగజారిందని ఎంసెట్లో చాలా ఎక్కువ ర్యాంకు వచ్చినవాడు యూనివర్సిటీని ఎంచుకునే స్థాయికి విశ్వవిద్యాలయ ప్రతిష్ట దిగజారిందని తెలిపారు. కేవలం మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రైవేట్ కాలేజ్ గా ఉంటూ వచ్చిన జేఎన్టీయూ ఇప్పుడు వారి కబంధహస్తాల నుంచి బయటకు రావలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నత స్థానంలో ఉండాల్సిన జెఎన్టియు గురజాడ అధమ స్థానంలో ఉండడం విచారించదగ్గ విషయమని, ఈ ప్రాంతంలో ఉన్న ప్రతి పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా అప్పట్లో విశ్వవిద్యాలయం ఏర్పడిందని, ఆ స్ఫూర్తిని పక్కనపెట్టి స్వార్థ రాజకీయాలకు నెలవైంద ని, తెలియజేస్తూ, ఈ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని విశ్వవిద్యాలయాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తే ప్రతి విద్యార్థి ఉద్యోగస్తుడిగా ఎదుగుతారని, ఈ ప్రాంతం అభివృద్ధికి ఇది చాలా దోహదం చేస్తుందని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా రాజకీయ నాయకుల కబంధహస్తాల లోంచి విముక్తి కలిగించి విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి పూర్తిస్థాయి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. సమస్యలను విన్న వీ సీ సుబ్బారావు స్పందిస్తూ, విశ్వవిద్యాలయ ప్రతిష్ట ను పెంచేందుకు విద్య మరియు పరిపాలనపరంగా అభివృద్ధి పరిచేందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటానని, ఈ విశ్వవిద్యాలయంలో చదువుకున్న ప్రతి విద్యార్థి కి ఉద్యోగం రావడమే లక్ష్యంగా ప్రయత్నం చేస్తామని మిస్పాక్షికమైన ప్రొఫెసర్లను కీలక స్థానాల్లో ఎంపిక చేసుకుని పాలనపరంగా పారదర్శంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం, డాక్టర్ అల్లాడి వీరభద్రరావు, డాక్టర్ దంతేశ్వర పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం

**వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్**

**వేములవాడ టౌన్‌లి:- జయ జయహే**




అక్టోబర్ 31సందర్భంగా, భారత ఐక్యతా స్ఫూర్తికి ప్రతీక అయిన సర్దార్ వల్లభభాయి పటేల్ గారి 150వ జయంతిపురస్కరించుకొని, వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో జాతీయ ఐక్యత సామరస్యం, దేశభక్తి, సమైక్యతా భావం పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యం. యువత, ప్రజలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేములవాడ పట్టణ సిఐ వీరప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సర్దార్ పటేల్ సేవలు, దేశాన్ని ఏకతా బంధంతో కట్టిపడేసిన ఆయన నాయకత్వం ప్రతి ఒక్కరికీ ప్రేరణ. మనమందరం ఐక్యతతో, స్ఫూర్తితో ముందుకు సాగితేనే దేశం అభివృద్ధి సాధిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వంతు సహకారం అందించాలని,వేములవాడ టౌన్ పోలీసు వారి ఆధ్వర్యంలో మల్లారం ఎక్స్ రోడ్ వద్ద సమయం: ఉదయం 07:00 గంటలకు ప్రారంభం అవుతుందిఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది,ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు మరియు వివిధ సామాజిక సంస్థల సభ్యులు పాల్గొననున్నారు.

# నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

### యుద్ధ ప్రాతిపదికన పంటనష్టం అంచనా... పరిహారం చెల్లింపు

### కృష్ణా జిల్లాలో మీడియా సమావేశంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, జయ జయహే**

మొంథా తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అంచనా వేసామని, ఇందులో ఒక్క కృష్ణా జిల్లాలోనే 46వేల హెక్టార్లలో నష్టం కలిగిందనీ చెప్పారు. ఈ జిల్లాలో దాదాపు 56 వేల మంది రైతులు నష్టపోయారని ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. గురువారం కృష్ణా జిల్లా పెనమలూరు, పామర్రు నియోజకవర్గాలలో స్థానిక ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కుమార్ రాజాలతో కలసి పర్యటించిన మంత్రి అచ్చెన్నాయుడు... మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న కంద, అరటి, వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఆవేదన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తు సన్నద్ధత మూలంగా మొంథా తుపానును సమర్థవంతంగా ఎదుర్కోగలిగాం. పక్కా ప్రణాళికతో నష్టం తీవ్రతను తగ్గించాం. సుదీర్ఘ పాలనానుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు చూపు కారణంగానే తగినన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. వీడియో కాన్ఫరెన్సులు, ఆర్టీజీఎస్ ద్వారా 24 గంటలు పరిస్థితులను పర్యవేక్షిస్తూ.. అటు యంత్రాంగాన్ని,





ఇటు గ్రామ స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేశాం. ఈ విపత్తులో కౌలు రైతులు కూడా నష్టపోయారు, వారిని కూడా ఆదుకుంటాం అని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ పంటలకు రూ.829 కోట్లు, ఉద్యాన రంగంలో రూ.39 కోట్లు, సెరీకల్చర్ రూ.65 కోట్లు, ఆక్వా రంగంలో రూ.1,270 కోట్లు, పశుసంవర్ధక శాఖలో రూ.71 లక్షలు నష్టం వాటిల్లిందని మంత్రి తెలిపారు. తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 120 పశువులు చనిపోయాయని వివరించారు. త్వరలోనే నష్టం అంచనాలను తయారు చేసి కేంద్రానికి పంపిస్తామని స్పష్టం చేశారు. గతంలో తుఫాన్ ప్రభావం తగ్గిన వారం రోజుల వరకూ కోలుకునే పరిస్థితి ఉండేది కాదు. తుఫాన్లు, వర్షాలను ఆపలేం కానీ అప్రమత్తత, ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించే అవకాశం ఉందని అన్నారు.

#### రైతులకు తగిన న్యాయం చేస్తాం

తుఫాన్ ప్రభావంతో చేతికొచ్చిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వరి, వాణిజ్య పంటలు విస్తృతంగా నష్టపోయాయని పేర్కొన్నారు. రైతులకు తగిన న్యాయం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. వ్యవసాయ, హార్టికల్చర్ శాస్త్రవేత్తలను రంగంలోకి దించి, మిగిలిన పంటలను కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి స్థాయి సర్వే పూర్తవుతుందని, కేంద్రం సహకారంతో రైతులకు తగిన నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం కాలంలో 20 వేల రూపాయల నష్టపరిహారాన్ని 17 వేల రూపాయలకు తగ్గించిందని, అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ నష్టపరిహారాన్ని 20 వేల నుండి 25 వేల రూపాయలకు పెంచామని గుర్తుచేశారు. కేంద్రం నిర్ణయించిన దానికంటే అధికంగా పరిహారం అందజేస్తున్నామని చెప్పారు. రైతులు మళ్లీ పంటలు వేసేందుకు సిద్ధమైతే విత్తనాలను ప్రభుత్వం అందజేయడానికి సిద్ధంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 95 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని, మిగిలిన 5 శాతం కూడా నవంబర్ 12 లోపు పూర్తి చేస్తామని చెప్పారు. రైతులకు ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలనే సంకల్పంతో ఉన్నామని అన్నారు. ప్రతి గ్రామం, ప్రతి జిల్లాలో నష్టపోయిన పంటల వివరాలను న్యాయబద్ధంగా నమోదు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ముందస్తు ఆలోచనలతోనే ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామనీ, కాని పంట నష్టం జరిగినదని తెలిపారు. బుడమేరు వరద బాధితులకు 15 రోజుల్లో పరిహారం అందజేశామని, రైతుల పట్ల ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

#### జగన్ బహిరంగ చర్చకు రావాలి

జగన్‌కు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే వ్యవసాయశాఖ తీసుకున్న అభివృద్ధి చర్యలు, కూటమి ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న మంచి కార్యక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని మంత్రి అచ్చెన్నాయుడు సవాలు విసిరారు. గతంలో విపత్తులు వచ్చినప్పుడు వైసీపీ ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన వ్యక్తిలా కాకుండా, అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారంటూ అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వాటా భీమా నగదును చెల్లించలేదని స్వయంగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి పార్లమెంట్‌లో వెల్లడి చేశారని గుర్తు చేశారు. ఇది జగన్ పాలన ఎంత అసమర్థమో చూపించే నిదర్శనమని ఎద్దేవా చేశారు. వైసీపీ మాటలు తప్ప రైతులకు మేలు చేసిన పని ఏదీ లేదని విమర్శించారు. పొరుగు రాష్ట్రంలో కూర్చొని వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడటం కాదని క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకోవాలని సూచించారు.



## వివాహ వేడుకల్లో బీజేపీ సీనియర్ నాయకులు చొక్కాకుల వెంకటరావు

**విశాఖపట్నం జయ జయహే**

ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు కుమారుడు వంశీ పూజిత ల వివాహం విశాఖపట్నం పోర్ట్ స్టేడియం విశ్వనాధ్ కన్వెన్షన్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సి ఎం రమేష్ , రాష్ట్ర కొప్పుల వెలమ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, టిడిపి రాష్ట్ర నాయకులు దాడి రత్నాకర్, గవర కార్పరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేతిరెడ్డి సురేంద్రమోహన్, విశ్వనాథ్ కన్వెన్షన్ అధినేత బొడ్డేటి కాశీ విశ్వనాధ్, టిడిపి నాయకులు గూనూరు మల్లు నాయుడు మరియు ఇతర నాయకులతో కలిసి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు చొక్కాకుల వెంకటరావు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



## తుఫాన్ రైతులకు తీరని నష్టాన్ని కలిగించింది

### ప్రభుత్వం తక్షణమే స్పందించాలి..

**చోడవరం అక్టోబర్ 30**

బుచ్చయ్యపేట మండలంలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులతో కలిసి చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్ గురువారం తుఫాన్ ప్రభావం వల్ల తీవ్రంగా నష్టపోయిన పంట పొలాలను రైతులతో మమేకమై క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రైతాంగానికి జరిగిన నష్టం చూస్తుంటే చాలా దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మొంత' తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతుల పంట రుణాలన్నింటినీ బేషరతుగా, పూర్తిగా మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ తుఫాన్ వల్ల జరిగిన పెను నష్టాన్ని వివరిస్తూ, ఇది రైతాంగాన్ని పూర్తిగా కుంగదీసిందని, ప్రభుత్వం నుండి గణనీయమైన సహాయం అందకపోతే వారు కోలుకోలేని నష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ దఫా రైతులు పంటపై తీసుకున్న రుణాన్ని పూర్తిగా మాఫీ చేయాలి. మొంత తుఫాన్ రైతులకు తీరని నష్టం కలిగించింది," అని అన్నారు.తుఫాన్ ప్రభావంతో పంటలు పూర్తిగా దెబ్బతినడం, వ్యవసాయ మౌలిక సదుపాయాలు నాశనం కావడం,పశుసంపద నష్టపోవడం వంటి కారణాలతో రైతాంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు.

# జలాశయాలలో కొనసాగుతున్న నీటి విడుదల





### బలిమెలకు 4 వేలు క్యూసెక్కులు నీరు విడుదల

### నీట మునిగిన సరిహద్దు వంతెన

**ముంచంగిపుట్టు, జయ జయహే**

ఆంధ్రా ఒడిశా రాష్ట్రాలు సంయుంగా నిర్వహిస్తున్న మాండ్ ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు, డుడుమ జలాశయాల నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. ముంథా తుఫాన్ కారణంగా గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా ఆ రెండు జలాశయాల్లోకి వరదనీరు ఇన్ ఫ్లో పెరిగింది. జోలాపుట్టు జలాశయంలో 2750. అడుగులు నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉండగా గురువారం 2748.85 అడుగులు నీటి మట్టం నమోదు అయింది. ఇక్కడ నుంచి దిగువ ప్రాంతంలో గల డుడుమకు 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే డుడుమ. జలాశయం నుంచి బలిమెలకు 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన నీటిని డుడుమ నుంచి సరఫరా చేస్తున్నామనిప్రాజెక్టు అధికారులు తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా నీటి విడుదల చేపట్టడం జరుగుతుందని వారు చెప్పారు. రెండు జలాశయాల్లో గరిష్ట స్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయి. ఇన్ఫ్లో ఎక్కువగా ఉంది.. నీటి నిల్వలు సాధారణ స్థాయికి వచ్చే వరకు నీటి విడుదల కొనసాగుతాదని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

#### నీట మునిగిన సరిహద్దు వంతెన

జోలాపుట్టు జలాశయం నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతో ఆ జల సయానికి దిగు ప్రాంతంలో ఉన్న సరిహద్దు వంతెన దాదాపుగా నీట మునిగిపోయింది. గత మూడు రోజులగా భారీగా నీటిని విడుదల చేయడంతో సరిహద్దు వంతెన పై భాగాన్ని తాకుతూ వరద నీరు ప్రవహిస్తుంది. అలాగే సరిహద్దు వంతెన ముందు భాగం కొంత కోతకి గురైంది. గత పదివేల క్రితం జోలాపుట్టు జలాశయం నుంచి ఒక్కసారిగా సుమారు 20వేల తీసుకులకు పైగా నీటిని విడుదల చేయడంతో సరిహద్దు వంతెన దెబ్బ తిన్న విషయం తెలిసిందే. అటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రాజెక్ట్ అధికారులు నిబంధనలను ప్రకారం, ఉన్నత అధికారుల పర్యవేక్షణలో నీటి విడుదల జరిగే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే గత సంఘటనలు అయ్యే అవకాశం ఉందని ఈ రాష్ట్రాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



## మళ్లీ తెగిన కాజ్వే

### నిలిచిపోయిన రాకపోకలు

### మరలా స్పందన ఎప్పుడు?

**చోడవరం అక్టోబర్ 30**

చోడవరం వడ్డాది రహదారి మధ్యలో విజయరామరాజుపేట వద్ద తాచెరు నదిపై గల డైవర్షన్ మరలా గండిపడింది. నెల రోజుల క్రితం సుమారు 16 లక్షల రూపాయలతో ఈ కాజ్వే నిర్మించారు. ఇంతలోనే మరలా వరదలు రావడం ఆ పేరుతో గండి కొట్టడం షరా మామూలుగా మారిపోయింది. అప్పట్లోనే సుమారు రెండు మాసాలపాటు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొనడంతో అధికారులు ప్రజాప్రతినిధులు ఎప్పుడు స్పందిస్తారని ప్రశ్నిస్తున్నారు. బి ఎన్ రోడ్డుల గల ఈ ప్రధాన రహదారి మీదుగా మాడుగుల నర్సీపట్నం పాడేరు వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో ఇదొక ప్రధాన రహదారి. ఈ నేపథ్యంలో ఈ రహదారి నిర్మాణానికి ఎన్నో అవతారాలు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. అధికారులు ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో పనిచేయడం లేదంటూ ప్రజాసంఘాలు ప్రజలు మండిపడుతున్నారూ. తాజాగా సంబంధించిన తుఫాన్ మూలంగా ఈ కాజు వే కోతకు గురైంది ఈ నేపథ్యంలో అధికారులు ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి ఉన్న నిర్మాణ పనులు ప్రారంభించాలని ముఖ్యంగా ప్రధాన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# బూసిపుట్టు పంచాయతీని యధావిధిగా కొనసాగించాలి

### ఆ ప్రాంతీయులు భారీ ఆందోళన

**ముంచంగిపుట్టు, జయ జయహే:**

మండలంలో గల మారుమూల బూసిపుట్టు పంచాయతీని ముంచంగిపుట్టు మండలంలో యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంతీయులు గురువారం పంచాయతీ కేంద్రంలో భారీ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. బూసిపుట్టు పంచాయతీని ముంచంగిపుట్టు మండలంలో కొనసాగించాలని, మద్దిగరువు మండలంలో విలీనం చేస్తే ఊరుకోమని పలు గ్రామాలకు చెందిన సుమారు 200 మందికిపైగా ప్రజలు ప్లకార్డులను చేతపట్టి




సుమారు నాలుగు కిలోమీటర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతీయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన మండలాలఏర్పాటులో భాగంగా మద్దిగరువును మండల కేంద్రంగా ఏర్పాటు చేసి, అందులోముంచంగిపుట్టు మండలానికి చెందిన బూసివుట్టు పంచాయతీని విలీనం చేసేందుకు చూస్తున్నారని అన్నారు. దాని వలన బూసివుట్టు వంచాయతీ ప్రజలు తీవ్రఇబ్బందులు పడే అవకాశం ఉందని, పలు సమస్యలను ఎదుర్కోవలసి వస్తాదని. ప్రభుత్వం స్పందించి ఆ ప్రక్రియను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బూసి పుట్టు పంచాయతీ సర్పంచ్ కె.రాజమ్మ, మాజీ సర్పంచు వి.మంగలన్న, నాయకులు కె.నాగేశ్వరరావు, కె.సూరిబాబు, కె.సింహాచలం, డి.తిరుపతి, కె.రాజారావు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల అభివృద్ధే లక్ష్యం





## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి : (జయ జయహే)**

అన్ని రంగాల్లో ఆర్యవైశ్యుల అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ ఆధ్వర్యంలో వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ సంఘం, ఏపీ ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి, వాసవీ ఫౌండేషన్, ఐవీఎఫ్ ప్రతినిధులు ప్రతినిధులు గురువారం కలిశారు. రాష్ట్రంలోని వైశ్యులను ఆర్య, శెట్టి, గుప్త, కోమటి, వేగిన, బుక్క, జనపశెట్టి అనే పేర్లతో సంభోదిస్తున్నారని, వారందరినీ ఆర్యవైశ్యులుగా ప్రభుత్వం గుర్తిస్తూ చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఆది నుంచి సీఎం చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఆర్థికంగానూ, రాజకీయంగానూ అభివృద్ధి చెందేలా ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ను ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. 2018-19లో ఆర్యవైశ్యుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.30 కోట్లు కేటాయించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. అన్ని కులాల మాదిరిగానే ఆర్యవైశ్యుల్లోనూ పేదలున్నారని, అటువంటి వారిని గుర్తించి ఆర్థికంగా అభివృద్ధే చెందేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఏపీ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మాదిరిగా ఆర్యవైశ్యులకు ఆర్థిక భరోసా కల్పించడానికి సహకార క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. త్వరలోనే ఏపీ ఆర్యవైశ్య కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తున్నామన్నారు. ఏపీ ఆర్యవైశ్య కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా ఆర్యవైశ్యులకు రుణ సదుపాయం కల్పించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయిదేళ్ల జగన్ పాలనలో ఆర్యవైశ్యులకు ఎటువంటి మేలు చేయలేదన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ఆర్యవైశ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి కొనియాడారు. ఆర్థిక రంగంలో, వ్యాపారాల నిర్వహణలో ఆర్యవైశ్యులు కీలకమని, తమ వ్యాపారాల నిర్వహణతో ఎందరికో ఉపాధి కల్పిస్తున్నారని అన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా ఇంటికో వ్యాపార వేత్తను తయారు చేసేలా సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధంచేశారన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటులో ఆర్యవైశ్యులకు పెద్దపీట వేయబోతున్నామన్నారు.

**అమ్మవారి పేరుతో వాసవీ పెనుగొండగా నామకరణం**

అమరావతిలో పొట్టి శ్రీరాముల స్మారక స్మృతివనం ఏర్పాటుకు 6.8 ఎకరాల కేటాయించారని మంత్రి సవిత తెలిపారు. ఇటీవల ఆర్యవైశ్యుల కులదైవం కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆత్మార్పణ దినోత్సవం రోజున ప్రభుత్వ తరఫున అధికారికంగా పట్టు వస్త్రాల సమర్పించారన్నారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారు జన్మించిన పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ గ్రామానికి వాసవీ పెనుగొండ గ్రామంగా త్వరలో పేరు మార్చనున్నామని, ఈ మేరకు త్వరలో జీవో రానుందని తెలిపారు. దామాషా ప్రకారం ఆర్యవైశ్యులకు పదవుల కేటాయిస్తున్నామన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు అందజేయబోతున్నామన్నారు.

**ఆర్యవైశ్యులుగా గుర్తించేలా కృషి**

వివిధ పేర్లతో సంభోదిస్తున్న ఆర్యవైశ్యులను ఒకే గొడుగు తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నామని, ఇదే విషయం ఇప్పటికే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని మంత్రి సవిత వెల్లడించారు. ఆర్య, శెట్టి, గుప్త, కోమటి, వేగిన, బుక్క, జనపశెట్టి...ఇలా వివిధ పేర్లతో పిలుస్తున్న వైశ్యులందరినీ ఆర్యవైశ్యులుగా గుర్తిస్తూ చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మొంథా తుఫాన్ తో భారీ నష్ట కలుగుకుండా సీఎం చంద్రబాబునాయుడు, అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలను ఆర్యవైశ్య సంఘాలు ప్రతినిధులు కొనియాడారు. అనంతరం మంత్రి సవితను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్, భగవాన్ నారాయణ, చిన్ని రామసత్యనారాయణ, కె.రజనీ, తల్లం సత్యనారాయణ, వీవీకే నర్సింహారావు, కోనా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ నృత్యంలో అక్కచెల్లెళ్లకు కళాపురస్కార్ అవార్డులు







**ధవళేశ్వరం,జయ జయహే.**

కడియం గ్రామానికి చెందిన మామిడిపల్లి జనార్ధన్ ప్రసాద్, భార్గవి దంపతుల కుమార్తెలు నిత్య శ్రీవల్లి ,దివ్యశ్రీ గంగ శాస్త్రీయ నృత్యం లో చూపిన ప్రతిభ కి కళాపురస్కార్ అవార్డులు పొందారు. ఈ చిన్నారులు రాధాకృష్ణ కళాక్షేత్రం ధవళేశ్వరం లో గురువులైన జి వి నారాయణ,ఉమా జయశ్రీ ,లక్ష్మి దీపిక దగ్గర నృత్యం లో శిక్షణ పొందుతున్నారు. త్యాగరాయ గానసభ చిక్కడపల్లి లో శ్రీ రాధాకృష్ణ కళా క్షేత్ర,భారతయువ సేవా సంగ్ సింధు భైరవి కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యం లో చిన్నారులకు కళాపురస్కార్ అవార్డులు బుధవారం ప్రధానం చేసారు. ప్రాచీన కళా కేంద్రం చండీగఢ్ యూనివర్సిటీ నుండి శాస్త్రీయ నృత్యం లో ఉత్తీర్ణులు అయిన విద్యార్ధులకు ఈ అవార్డులు ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలియచేసారు. ముఖ్య అతిథి గా విచ్చేసిన ప్రముఖ టీవీ నటుడు అనిల్ అల్లం మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యం లో ఎంతో కృషి చేస్తే ఇటువంటి ప్రదర్శనలు చేయడం జరుగుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో భరద్వాజ్ ,బాలకృష్ణన్ ప్రశాంత్ జీ, రాజశేఖర్ నూకరాజు,గోవిందు ,నారాయణ,షేక్ షా వల్లీ ,రాజీవ్ గాంధీ, వరలక్ష్మీ, దుర్గాప్రసాదరావు ,నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ చిన్నారులు గతం లో అన్నవరం యాదాద్రి, శ్రీ శైలం వంటి అన్నిప్రముఖ దేవాలయాలలో నృత్య ప్రదర్శన చేశారు.. ఈ చిన్నారులను పలువురు అభినందించారు.

# తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోళ్లు చేస్తుంది

**వరద ప్రమాదం జరగకుండా భద్రత చర్యలు చేపట్టాలి**

**తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి**

**మార్కెట్ కమిటీ ద్వారా పత్తి కొనుగోలు**

**మంత్రి గుమ్మడి సంధ్యారాణి**

**మక్కువ, అక్టోబర్ 30, (జయజయహే):-**

తుఫాను కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర గిరిజన , స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇచ్చారు. గురువారం నాడు ఆమె వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల సంభవించిన ముంథా తుఫాన్ కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆమె హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ ద్వారా వరద నీరు విడుదల చేసే సమయంలో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ప్రమాదం జరగకుండా భద్రత చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటిమట్టం, ఇన్‌ఫ్లో ,ఔట్‌ఫ్లో వివరాలు ఇంజనీరింగ్ అధికారులను తెలుసుకున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుత సాగునీటి అవసరాలు, భవిష్యత్ నీటి వినియోగ ప్రణాళికలపై ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల సంభవించిన ముంథా తూఫాన్ వలన పంటలు నష్టపోయిన రైతులుకు పూర్తిగా న్యాయం చెయ్యాలని అధికారులు ఆదేశించారు. పత్తి రైతులకు గిట్టిబాటు కల్పించే విధంగా సాలూరు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వమే పత్తి కొనుగోలు చేస్తామని ఆమె తెలిపారు. పంట నష్టాలపై పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్, ఆశ్రమ పాఠశాలలు, ఇతర విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థుల అర్యోగం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె వెంట మక్కువ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుళ్ల వేణుగోపాలనాయుడు లతో పాటు మక్కువ , తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. అలాగే తహసిల్దార్ కె భరత్ కుమార్, ఎంపీడీవో, ఎన్ అర్జునరావు తదితరుల అధికారులు పాల్గొన్నారు







# పారిజాతగిరిలో కార్తీక మాసం శ్రవణ నక్షత్ర కళ్యాణోత్సవం

**అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో**

**భోజనసాల నిర్మాణం కోసం ప్రతి పాదన**

**జంగారెడ్డిగూడెం, జయ జయహే**

స్థానిక గోకుల పారిజాతగిరిలో కార్తీక మాసం సందర్భంగా స్వామివారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం కనుక శ్రీదేవి భూదేవి శ్రీ స్వామి వారి కళ్యాణం అత్యంత వైభవం గా కన్నులు పండగ గా గురువారం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారని ఈ ఓ కల గర రాంబాబు తెలిపారు. కళ్యాణోత్సవం వేడుకలు ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచారి రిషికేష్ చార్యులు కుమార్ ఆచార్యులు రాఘవాచార్యులుఆధ్వర్యంలో అత్యంత వైభవం జరిపించి నట్టు పేర్కొన్నారు ఆలయ అభివృద్ధి కమిటీఅధ్యక్షుడు సభ్యులు పేరిచర్ల జగపతి రాజు ఆధ్వర్యంలో ఆలయ వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై, ప్రతి శనివారం జరిగే గిరిప్రదక్షిణ కార్యక్రమంలో, ఏడుకొండలు పరిరక్షణలో, ఘనంగా పెరిగిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, కొత్త అన్నదాన మండపం ఏర్పాటుకు చర్చించారు. ఈ కార్యక్రమములో ఆలయఅభివృద్ధి అధ్యక్షులు పేరిచర్ల పేరిచర్ల జగపతి రాజు గొట్టుముక్కల భాస్కర్ రాజు, కూచిపూడి రమేష్, కానూరు శ్రీనివాస్, వాసవి సాయి నగేష్, యోలూరు పని కుమార్,కర్పూరం కృష్ణారావు, దారచక్రవర్తి, సుబ్రహ్మణ్యం, దార రవీందర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



# వెంకుపాలెంలో తుఫాన్ నీటిలో మునిగిన వరి పంటలు

**అనకాపల్లి జయ జయహే**

మో0త తుఫాన్ వల్ల భారీ వర్షాలకు వెదుళ్ళ గడ్డకు గండిపడటం వల్ల భారీ ఎత్తున నీటి ప్రవాహం రావడంతో వరి పంటలకు భారీ నష్టం వాటిల్లింది 250 ఎకరాల్లో పంటలు నీటిలో మునిగిపోయాయి అని మాజీ ఎమ్మెల్యే బుద్ధ నాగ జగదీష్ పేర్కొన్నారు. ఎంకుపాలెం గ్రామం సందర్శించి రైతులతో మాట్లాడిన ఆయన రాత్రి నుండి కురిసిన వర్షాలకు చేతికి వచ్చిన పంట నష్టపోయేమని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని అని ఆయన పేర్కొంటూ మండల ప్రత్యేక అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం వ్యవసాయ శాఖ ఏఈ ఆర్డబ్ల్యూఎస్ అధికారులు రైతులు కలిగిన తుఫాన్ వల్ల కలిగిన నష్టాన్ని వారికి వివరించామని నాగ జగదీష్ తెలియజేశారు. మునిగిన పంటల పరిశీలనలో నాకు జగదీష్ తో కలిసి వెంకుపాలెం రైతులు పోలమర శెట్టి సూరిబాబు, అప్పలస్వామి నాయుడు దాడి శ్రీనివాసరావు రాపేటి నాగేశ్వరరావు కట్టా నాయుడు ఆడారి నారాయణరావు సరగడం నాగేశ్వరరావు కాండ్రేగుల సత్యనారాయణ కాండ్రేగుల రవీంద్ర పొలిమేర నాయుడు తదితరులు పాల్గొన్నారు

# తుఫాను నుండి ప్రజల ప్రాణ నష్టం తగ్గించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్**

**అనకాపల్లి జయ జయహే**



భీకరమైన మో0తా తుఫాను హెచ్చరికలను ఎదుర్కోవడంలో ముఖ్యమైన నారా చంద్రబాబు తనకున్న అనుభవం ప్రణాళిక సాంకేతిక పరిజ్ఞానంతో నష్ట నివారణ చేయగలిగారని, అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఐటీ శాఖ మంత్రులు నారా లోకేష్ హెూం మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత మరియు మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, మండల సభ్యులు వివిధ శాఖల అధిపతులు కృషి ఫలితంగా 90% ఎదుర్కొని ప్రజలను సురక్ష ప్రాంతాలకు తరలించడం వారికి ఆహారం మంచినీరు అందించే వరద ప్రాంతంలో ప్రజలకు రక్షణ షెల్టర్ లో విద్యుత్తు లైటింగ్ ఇబ్బందులు కలగకుండా సఫలీకృతం చేశారని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ వారందరికీ అభినందనలు తెలియజేశారు ముఖ్యంగా రైతాంగం పంట చేతులకు వచ్చే సమయానికి తుఫాను రైతులకు ఇబ్బందులు గురి చేసే ఆర్థిక నష్టం జరిగిందని అధికార యంత్రాంగానే అప్రమత్తం చేసి ప్రజల ప్రాణ నష్టం జరగకుండా నివారణ చర్యలు తీసుకోవడం వల్ల పెద్దగా ప్రాణ నష్టం జరగలేదని నష్టపోయిన రైతాంగానికి పంట నష్టం అంచనా వేసి ఆర్థిక సహాయం అందించేందుకు అధికార యంత్రాంగం ప్రభుత్వానికి సహకరించి రైతులను ఆదుకోవాలని నాగి జగదీష్ పేర్కొన్నారు సముద్ర తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులు వేటకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేస్తూ ప్రాణ నష్టం జరగకుండా వివరించారని అదేవిధంగా ప్రతి మత్స్యకార కుటుంబానికి 3000 రూపాయలు 25 కేజీల బియ్యం ఇచ్చి ప్రభుత్వం ఆదుకున్నదని తుఫాను హెచ్చరికలు ఎప్పటికప్పుడు ప్రింట్ మీడియా ఎలక్ట్రాన్ మీడియా సోషల్ మీడియా ద్వారా ప్రచారం బాగా ప్రచారం చేసి ప్రజలకు మేలు చేశారని చంద్రబాబు తనకున్న ప్రతిభను కనబరిచి ప్రజలకు మేలు చేశారని గతంలో ఎదుర్కొన్న హుదు తుఫాన్, తిత్లి, బుడమేరు సంఘటనను ఎదుర్కొన్న అనుభవాలు దృష్టిలో పెట్టుకొని ఈ క్లిష్ట సమయంలో ముఖ్యమంత్రి ప్రజలను రక్షించడంలో సఫలీకృతం అయ్యారని ప్రజలు అందరూ కృతజ్ఞత భావంతో ఉన్నారని అలాగే పార్టీ శ్రేణులను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పార్టీ అధినాయకులు పిలుపుతో పార్టీ నాయకులు కార్యకర్తలు ఛత్రస్థాయిలో పాల్గొని ప్రజలకు రక్షణగా ఉన్నారని ముఖ్యమంత్రి ఆదేశాలతో పారిశుధ్యం శాఖ ఎలక్ట్రికల్ శాఖ పోలీస్ యంత్రాంగం రెవిన్యూ శాఖ క్షేత్రస్థాయిలో నగ్రహారాలు చూడకుండా పని చేశారని వారికి ప్రత్యేకమైన అభినందనలు ఆయన పేర్కొన్నారు

# ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనున్న టీమిండియా

### మెల్‌బోర్న్ వేదికగా నేడు రెండో టీ20
### ఎక్స్‌ట్రా పేసర్‌తో బరిలోకి దిగనున్న భారత్
### అర్ష్‌దీప్ సింగ్ ను జట్టులోకి తీసుకునే చాన్స్




ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను వరుణుడు మింగేయడంతో టీమిండియా మరో ఆసక్తికరమైన పోరుకు సిద్ధమైంది. మెల్‌బోర్న్ వేదికగా శుక్రవారం జరిగే రెండో టీ20లో ఆతిథ్య ఆసీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. వర్షం అంతరాయం కలిగించిన తొలి మ్యాచ్‌లో భారత్ బ్యాటర్లు దుమ్మురేపారు. అదే జోరును రెండో టీ20లోనూ కొనసాగించాలనుకుంటున్నారు. తొలి టీ20లో ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు స్పెషలిస్ట్ పేసర్లతో పాటు ఓ పేస్ ఆల్‌రౌండర్‌తో బరిలోకి దిగిన టీమిండియా.. రెండో టీ20లో తమ కాంబినేషన్‌ను మార్చుకునే ఛాన్స్ ఉంది.మెల్ బోర్న్ పిచ్ సాధారణంగా పేస్‌కు అనుకూలంగా ఉంటుంది. ఇది బౌన్సీ పిచ్. బ్యాటర్లు పరుగుల పండుగ చేసుకుంటారు. మైదానం పెద్దది కాబట్టి స్పిన్నర్లు వికెట్లు తీయకపోయినా.. పరుగులు నియంత్రించే అవకాశం ఉంటుంది. ఈ మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. పిచ్ కండిషన్స్‌ను పరిగణలోకి తీసుకుంటే.. టీమిండియా ఎక్స్‌ట్రా పేసర్‌తో బరిలోకి దిగవచ్చు. అప్పుడు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. అదనపు పేసర్‌గా అర్ష్‌దీప్ సింగ్ తుది జట్టులోకి వస్తాడు.ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బరిలోకి దిగనున్నారు. తొలి టీ20లో ఈ ఇద్దరు మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఏడాది పేలవ ప్రదర్శన కనబర్చిన టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా తొలి మ్యాచ్‌తో టచ్‌లోకి వచ్చాడు. తనకు అచ్చొచ్చిన ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగి దుమ్మురేపాడు. తిలక్ వర్మ, సంజూ శాంసన్, శివమ్ దూబే మిడిలార్డర్‌లో ఆడనున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్ కొనసాగనుండగా.. వికెట్ కీపర్‌గా సంజూకు ప్రాధాన్యత దక్కనుండటంతో జితేష్ శర్మకు మరోసారి నిరాశే ఎదురు కానుంది.స్పెషలిస్ట్ స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి జట్టులో కొనసాగనున్నారు. ఎక్స్‌ట్రా పేసర్ కావాలనుకుంటే ఈ ఇద్దరిలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. తొలి టీ20లో అర్ష్‌దీప్ సింగ్‌ను కాదని హర్షిత్ రాణాను ఆడించడం విమర్శలకు దారి తీసింది. కానీ అతను బ్యాటింగ్ చేయడంతో పాటు ఆసీస్ కండిషన్స్‌లో బాగా రాణించగలడనే కారణంతో తుది జట్టులోకి తీసుకున్నారు. మరోసారి బుమ్రాకు తోడుగా అతన్నే కొనసాగించనున్నారు.

రెండో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా)

అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి/అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా.

ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైన భారత టీ20 జట్టు:

సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ శాంసన్, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్.



# నేను ప్రస్తుతం కోలుకునే దశలో ఉన్నాను


### భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్

సిడ్నీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ ఆరోగ్యంపై తాజా సమాచారం ఇచ్చారు. గత కొన్ని రోజులుగా ఆసుపత్రిలో ఉన్న అయ్యర్ ప్రస్తుతం కోలుకుంటున్నట్లు తెలిపారు. దీని గురించి శ్రేయాస్ అయ్యర్ సోషల్ మీడియా పోస్ట్‌ను షేర్ చేస్తూ, "నేను ప్రస్తుతం కోలుకునే దశలో ఉన్నాను. రోజురోజుకూ మెరుగుపడుతున్నాను. మీ నుంచి నాకు లభించిన మద్దతుకు నేను చాలా కృతజ్ఞుడను. నన్ను మీ ఆలోచనల్లో ఉంచుకున్నందుకు ధన్యవాదాలు" అంటూ శ్రేయాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు. దీంతో శ్రేయాస్ అయ్యర్ ఆరోగ్యంపై ఉన్న ఆందోళనలు తొలగిపోయాయి. ఆయన కోలుకుంటున్నందున, డిశ్చార్జ్ అయి మరో వారంలో భారతదేశానికి తిరిగి రావొచ్చు. ముంబైలో ఆయన చికిత్స కొనసాగించే అవకాశం కూడా ఉంది. ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మూడో వన్డేలో, హర్షిత్ రాణా వేసిన బంతిని అలెక్స్ కారీ అద్భుతమైన షాట్ కొట్టాడు. బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో నిలబడి ఉన్న అయ్యర్ వేగంగా పరిగెత్తి డైవింగ్ క్యాచ్ తీసుకున్నాడు. ఈ డైవింగ్ సమయంలో, అతని ఎడమ పక్కటెముకలకు తీవ్ర గాయం అయింది. దీని వల్ల అతని ప్లీహము (ప్లీహము) పైన ఉన్న అవయవంలో అంతర్గత రక్తస్రావం జరిగింది. దీని కారణంగా, అతను అస్వస్థతకు గురయ్యాడు. స్కానింగ్ నివేదికలో శ్రేయాస్ అయ్యర్ ప్లీహములో కొంత భాగం చీలిపోయినట్లు తేలింది. అందువల్ల, అతను ఇంటర్వెన్షనల్ ట్రాన్స్-కాథెటర్ ఎంబోలైజేషన్ చికిత్స చేయించుకున్నాడు. ప్రస్తుతం ఆయన కోలుకున్నారని, ఐసీయూ నుంచి వార్డుకు మార్చారని సమాచారం. శ్రేయాస్ అయ్యర్ మరో వారం రోజుల్లో భారత్ కు తిరిగి వస్తారని సమాచారం. ప్రస్తుతం వైద్య పర్యవేక్షణలో ఉన్న శ్రేయాస్ అయ్యర్ పూర్తిగా కోలుకోవడానికి రెండు నెలలు పడుతుందని తెలిసింది. అందుకే, నవంబర్‌లో జరగనున్న దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌లో శ్రేయాస్ అయ్యర్ కనిపించడు. జనవరి నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లయితే మాత్రమే అతను న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో కూడా కనిపిస్తాడు.

# సంజూ శాంసన్ జట్టులో అత్యంత దురదృష్టవంతుడు

### మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్






వెటరన్ వికెట్ కీపర్ సంజూ శాంసన్ భారత జట్టులో అత్యంత దురదృష్టవంతుడని మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. తరుచూ అతని బ్యాటింగ్ ఆర్డర్‌ను మారుస్తున్నారని, దాంతో సంజూ బ్యాటింగ్ రిథమ్‌తో పాటు ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందన్నాడు. శుభ్‌మన్ గిల్ గైర్హాజరీలో ఓపెనర్‌గా ఆడిన సంజూ శాంసన్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. 10 ఇన్నింగ్స్‌ల్లో 3 శతకాలు సాధించాడు. గిల్ రాకతో మళ్లీ మిడిలార్డర్‌కు మారిన సంజూ శాంసన్.. ఒక్కో మ్యాచ్‌కు ఒక్కో స్థానంలో ఆడుతున్నాడు.కొన్నిసార్లు నెంబర్ 3లో ఆడితే.. మరికొన్నిసార్లు నెంబర్5, నెంబర్ 8లో ఆడుతున్నాడు. తాజాగా ఆస్ట్రేలియాతో తొలి టీ20లోనూ సంజూ శాంసన్ మిడిలార్డర్‌కే పరిమితమయ్యాడు. దాంతో అతని బ్యాటింగ్ ఆర్డర్‌పై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన క్రిష్ శ్రీకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బ్యాటింగ్ విషయంలో సంజూ శాంసన్‌తో టీమిండియా మేనేజ్‌మెంట్ మ్యూజికల్ చైర్ ఆడుతుందని విమర్శించాడు.'టీమిండియాలో దురదృష్టవంతుడు ఎవరైనా ఉన్నారంటే అది సంజూ శాంసనే. ఓపెనర్‌గా అతను శతకాలు బాదాడు. కానీ ప్రస్తుతం అతన్ని మూడో స్థానం నుంచి 8వ స్థానం వరకు బ్యాటింగ్‌కు పంపిస్తున్నారు. అవకాశం ఉంటే అతన్ని 11వ స్థానంలో కూడా ఆడించేలా ఉన్నారు. సంజూ శాంసన్ వంటి వ్యక్తులకు ఇది నిజంగా బాధకు గురిచేస్తోంది. టాపార్డర్‌లో మెరుగ్గా రాణించిన తర్వాత కూడా అతనికి సరైన బ్యాటింగ్ పొజిషన్ లేదు. అతనికి ఎలాంటి ఆప్షన్ కూడా లేదు. ఎక్కడ ఆడమంటే అక్కడ ఆడాల్సిన పరిస్థితి. మంచి విషయం ఏంటంటే ఆసియా కప్‌లో నెంబర్ 5లో కూడా అతను రాణించాడు. ఇది అతనికి శుభసూచకం. ఎందుకంటే ఇప్పుడు సంజూ శాంసన్ టీ20 వరల్డ్ కప్ 2026కు ఫస్ట్ ఛాయిస్ వికెట్ కీపర్‌గా మారిపోయాడు. నెంబర్ 5లోనే కచ్చితంగా బ్యాటింగ్ చేస్తాడు.'అని క్రిష్ శ్రీకాంత్ చెప్పుకొచ్చాడు. ఓపెనర్‌గా 12 ఇన్నింగ్స్‌లు ఆడిన శాంసన్ 37.90 సగటు, 183.70 స్ట్రైక్‌రేట్‌తో 471 పరుగులు చేశాడు. అభిషేక్ శర్మతో కలిసి అదిరిపోయే ఆరంభాలు అందించాడు. కానీ శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా జట్టులోకి తిరిగి రావడంతో సంజూ తన ఓపెనింగ్ స్థానాన్ని త్యాగం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆసియా కప్ 2025లో మిడిలార్డర్‌లోనూ సంజూ శాంసన్ సత్తా చాటాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో మెరుగ్గా రాణించడంపై ఫోకస్ పెట్టాడు.



# నల్ల బ్యాండ్స్‌తో భారత్, ఆసీస్ ఆటగాళ్లు..

మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న సెమీఫైనల్లో ఇరు జట్ల ఆటగాళ్లు నల్ల బ్యాండ్స్ ధరించి బరిలోకి దిగారు. 17 ఏళ్ల ఆసీస్ యువ క్రికెటర్ బెన్ ఆస్టిన్ అకాల మృతికి సంతాపంగా ఇరు జట్ల ఆటగాళ్లు బ్లాక్ ఆర్మ్ బ్యాండ్స్ ధరించారు. మెల్‌బోర్న్‌లో ప్రాక్టీస్ నెట్ సెషన్‌లో బంతి మెడ భాగంలో బలంగా తగలడంతో ఆస్టిన్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా దివంగత క్రికెటర్ ఫిలిప్ హ్యూస్ మరణ ఉదంతాన్ని గుర్తు చేసిన ఈ ఘటన యావత్ క్రికెట్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. 17 ఏళ్ల బెన్ ఆస్టిన్ మంగళవారం మధ్యాహ్నం ఫర్న్‌ట్రీ గల్లీలోని వ్యాలీ ట్యూ రిజర్వ్‌లో శిక్షణ తీసుకుంటుండగా ఈ విషాదకర సంఘటన జరిగింది. క్రికెట్ ఆస్ట్రేలియా వివరాల ప్రకారం.. ఈ యువకుడు నెట్స్‌లో హెల్మెట్ ధరించి బౌలింగ్ మెషీన్ ముందు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా.. బంతి అతని మెడ భాగంలో బలంగా తాకింది. దాంతో ఆస్టిన్ క్రీజులోనే కుప్పకూలిపోగా.. అతన్ని హుటాహుటిన మోనాష్ మెడికల్ సెంటర్‌కు తరలించారు. తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ బుధవారం ఆస్టిన్ తుదిశ్వాస విడిచాడు. 2014లో ఫిలిప్ హ్యూజ్ కూడా ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లో ఇలానే గాయపడి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. యువ క్రికెటర్ అకాల మృతికి సంతాపం తెలిపిన భారత్, ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్లు.. జాతీయ గీతాలపన సమయంలో బ్లాక్ ఆర్మ్ బ్యాండ్స్ ధరించి మౌనం కూడా పాటించారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆసీస్ బ్యాటింగ్ ఎంచుకోగా.. టీమిండియా మూడు మార్పులతో బరిలోకి దిగింది. గత మ్యాచ్‌లో గాయపడి జట్టుకు దూరమైన ప్రతికా రావల్ స్థానంలో షెఫాలీ వర్మ తుది జట్టులోకి రాగా.. రిచా ఘోష్, క్రాంతి గౌడ్ రీఎంట్రీ ఇచ్చారు. హర్లీన్ డియోల్‌పై వేటు పడగా.. ఉమా ఉద్వాసనకు గురైంది.ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ భారీ లక్ష్యం దిశగా దూసుకెళ్తోంది. కెప్టెన్ అలీస్సా హీలీ(5) త్వరగానే విఫలమైనా.. మరో ఓపెనర్ ఫోబ్ లిచ్‌ఫీల్డ్ సెంచరీతో చెలరేగింది. దాంతో 27 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్ వికెట్ నష్టానికి 178 పరుగులు చేసింది.

# తుఫాన్‌లో ప్రజల రక్షణకు అహర్నిశలు కృషి చేసిన పోలీసులు

### అనకాపల్లి జయ జయహే

మొంథా తుఫాన్ ప్రభావం లో ప్రజల రక్షణలో అహర్నిశలు కృషిచేసిన అనకాపల్లి జిల్లా పోలీసులు సమిష్టి కృషి నిదర్శనమని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో అనకాపల్లి జిల్లాలో చోటుచేసిన భారీ వర్షాలు, నది గట్లు గండ్లు పడడం వరదలు పరిస్థితుల మధ్య జిల్లా పోలీసులు ప్రజల ప్రాణ ఆస్తుల రక్షణ కోసం చాలా బాగా కృషి చేశారని అనకాపల్లి జిల్లా ఎస్పీ మార్గదర్శకం తో మొత్తం జిల్లా పోలీసు యంత్రాంగం సమయస్ఫూర్తితో చాకచక్యంగా వరదలో పటిష్టమైన చర్యలు చేపట్టిందని తుఫాను ప్రభావిత ప్రాంతాలు అనకాపల్లి కోటపాడు చోడవరం రాంబిల్లి ఎలమంచిలి మండలాల్లోని 36 గ్రామాల ప్రజల ప్రమాద స్థితి నుంచి పోలీసు ఇటు రెవెన్యూ సహకారంతో ప్రజలను సురక్ష ప్రాంతాలకు తరలించారు. మొత్తం 5576 మంది ప్రజలను తరలించి అక్కడ వారికి తాగునీరు ఆహారం, వైద్యం, వసతి సౌకర్యాలు కల్పించడం జరిగింది. మునపాక మండలం గణపతి వద్ద రైవాడ నది గట్టు కోతకు గురై నా ప్రాంతంలో పోలీసులు రెవెన్యూ మున్సిపల్ ఎస్.డి.ఆర్.ఎఫ్ సిబ్బందితో సమన్వయం తో వెళ్తూ 600 ఇసుక బస్తాలు లతో గట్టును పరిరక్షించారు అని తెలియజేశారు. కశింకోట




మండలం జోగారావుపేట, రాంబిల్లి మండలం పెద్ద కలవలపల్లిలో , నారాయణపురంలో, అచ్యుతాపురం, తిమ్మరాజు పేట , ఎలమంచిలి మండలం సోమలింగపాలెం వద్ద ఇసుక బస్తాలు వేసి వరద ఉధృతంగా నియంత్రించారని ఈ వర్షాల వలన రహదారులపై చెట్లు విద్యుత్తు స్తంభాలు కూలినచోట్ల పోలీసులు తక్షణ స్పందించి ఫైర్ మున్సిపల్ విద్యుత్ శాఖలతో సమన్వయం చేసి అడ్డంగులను తొలగించారు రోడ్లపై నీరు నిల్వ కాకుండా తాత్కాలిక డ్రైన్ మార్గాలు ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా ప్రమాదకర ప్రదేశాల్లో బందోబస్తు ట్రాఫిక్ నియంత్ర చర్యలు సమర్థంగా నిర్వహించారని రెవెన్యూ పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి ఇరిగేషన్ వైద్య ఆరోగ్యశాఖ విద్యుత్ శాఖ ఎన్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది నేషనల్ హైవే శాఖలతో జిల్లా పోలీస్ సుబ్రమణ్య సమిష్టిగా పనిచేస్తుందని ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ ద్వారా ప్రజలకు హెచ్చరికలు సమాచార అందించడం ద్వారా ఎటువంటి ప్రాణ నష్టం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారని జిల్లా ఎస్పీ తెలియజేశారు ఆయన స్వయంగా మునగపాక మండలంలోని గణపర్తి, చూచుకొండ, మెలిపాక యాదగిరి పాలెం వంటి లోతట్టు గ్రామాలను సందర్శించడం జరిగింది. ముంపునకు గురైన గ్రామస్తులతో మాట్లాడి పునరావాస కేంద్రాల్లో ఉండాలని వారికి సూచిస్తూ తాగునీరు ఆహారం వసతి సదుపాయాలు వెంటనే ఏర్పాటు చేయించారు ప్రజలందరూ అధికారులు సహకరించారని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఎస్ బాల సూర్యరావు, ఎలమంచిలి సర్కిల్ఇన్స్పెక్టర్ ఎస్ ధనుంజయరావు ,మునగపాక ఎస్సై పి ప్రసాద్, అనకాపల్లి జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వం లో అదనపు ఎస్పీలు ఏం దేవప్రసాద్, ఎల్ మోహన్ రావు, డిఎస్పి లు ఎం శ్రావణి, వి విష్ణు స్వరూప్, పి శ్రీనివాసరావు ,ఈ శ్రీనివాసులు, బి మోహన్ రావు లను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్న సిబ్బంది ఈ సందర్భంగా అభినందించడం జరిగింది

For a pure tomorrow..
జయహో

# నేడు బాహుబలి: ది ఎపిక్ విడుదల

## బాహుబలి-3పై ప్రేక్షకుల్లో ఉత్కంఠ






తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన 'బాహుబలి: ది బిగినింగ్' , 'బాహుబలి: ది కన్‌క్లూజన్ సినిమాలు ఇప్పుడు ఒకే వెర్షన్‌గా 'బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' టైటిల్‌తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీమియర్స్ గురువారం రాత్రి నుంచే ప్రారంభం కానుండగా, అన్ని ఫార్మాట్లలో సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. కొద్ది రోజులుగా ' బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' చివర్లో బాహుబలి 3 పై ప్రకటన ఉంటుందంటూ ప్రచారం జోరుగా సాగింది. అయితే, నిర్మాత శోభు యార్లగడ్డ ఇప్పటికే ఈ రూమర్లపై క్లారిటీ ఇచ్చారు. బాహుబలి 3 ప్రాజెక్ట్ గురించి ఇంకా చాలా వర్క్ చేయాల్సి ఉందని, ప్రస్తుత ఎడిట్‌లో అలాంటి ఎలాంటి ప్రకటన లేదని ఆయన స్పష్టం చేశారు. బాహుబలి 3 ప్రస్తావన లేకపోయినా, ఓ సర్ప్రైజ్ మాత్రం ఉండవచ్చని శోభు ఇటీవలే సూచించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అదేంటో తెలుసుకోవడానికి అందరూ ఎదురు చూస్తుండగా, ఇప్పుడు రాజమౌళి పరోక్షంగా దానిపై క్లారిటీ ఇచ్చినట్లు కనిపిస్తోంది. 'బాహుబలి: ది ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా విడుదలైన రాజమౌళి, ప్రభాస్, రానా చిట్‌చాట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గంటకుపైగా నిడివి గల ఈ వీడియోలో సినిమా వెనుక జరిగిన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బాహుబలి: ది ఎపిక్'లో అవంతిక లవ్ స్టోరీ, కొన్ని పాటలు, కొన్ని సన్నివేశాలు కటింగ్‌లో తొలగించాం. కథాంశాన్ని మరింత సూటిగా చూపించడానికే ఈ నిర్ణయం తీసుకున్నాం అని తెలిపారు. అలాగే, అందరూ బాహుబలి 3 వస్తుందని అనుకుంటున్నారని ప్రస్తావిస్తూ, అది కాదు అని స్పష్టంచేశారు. కానీ, ఒక స్పెషల్ సర్ప్రైజ్‌ను మాత్రం కన్ఫర్మ్ చేశారు. రాజమౌళి వెల్లడించిన ప్రకారం, బాహుబలి ఎపిక్ వెర్షన్ ఇంటర్వెల్‌లో 3డి యానిమేషన్ టీజర్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ టీజర్ ద్వారా బాహుబలి యూనివర్స్ కొనసాగనుందని చెప్పారు. ఈ యానిమేషన్ సీక్వెన్స్ దర్శకుడు ఇషాన్ శుక్లా రూపొందించినట్లు ఆయన వెల్లడించారు.



## మార్చి 19న లాక్ చేసిన టాక్సిస్

'కేజీఎఫ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత కన్నడ స్టార్ నటుడు యష్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్ యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు వార్తలు వచ్చాయి. సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండడంతో విడుదల తేదీ మారబోతుందని టాక్ వచ్చింది. అయితే ఈ రూమర్స్‌పై తాజాగా చిత్రబృందం స్పందిస్తూ.. విడుదల తేదీలో మార్పులు లేవంటూ ప్రకటించింది. చెప్పిన డేట్ ప్రకారమే వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కియార అద్వానీ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.



## మెగా 158లో నేను భాగం కావడం లేదు


### నటి మాళవికా మోహన్ ప్రకటన విడుదల

మెగాస్టార్ చిరంజీవి బాబీ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. వాల్తేర్ వీరయ్య లాంటి సూపర్ హిట్ తర్వాత ఈ జోడి మళ్లీ కలిసి పనిచేయబోతుంది. మెగా 158 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్ మీదకి వెళ్లనుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా మాళవిక మోహనన్ నటించబోతున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా ఈ వార్తలపై నటి స్పందిస్తూ.. అవన్నీ రూమర్స్ అంటూ తెలిపింది. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. నేను 'మెగా 158' చిత్రంలో నటిస్తున్నానని ఆన్‌లైన్‌లో అనేక వార్తలు వస్తున్నాయి. అయితే నా కెరీర్‌లో ఏదో ఒక రోజు ఐకానిక్ చిరంజీవి సార్‌తో స్క్రీన్ పంచుకోవాలని నేను ఎంతగానో కోరుకుంటున్నాను. కానీ ప్రస్తుతం నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదు. ఆ వార్తలు అవాస్తవం అంటూ మళావిక రాసుకోచ్చింది. దీంతో చిరంజీవి సరసన మాళవిక నటించబోతున్నారనే ఊహాగానాలకు తెరపడింది. త్వరలోనే ఈ చిత్రంలో నటించబోయే కథానాయిక గురించి చిత్ర బృందం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రస్తుతం చిరంజీవి నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. అనిల్‌రావిపూడి దర్శకత్వంలో 'మన శంకరవరప్రసాద్ గారు' రూపొందుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఇది విడుదల కానుంది. అలాగే వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర' రానుంది. వీటితో పాటు శ్రీకాంత్ ఓదెల, బాబీ దర్శకత్వంలో రెండు ప్రాజెక్టులు లైనప్‌లో ఉన్నాయి. ఇక మాళవిక 'ది రాజాసాబ్' తో పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న ఈ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది.




## మహాకాళిగా కన్నడనటి భూమిశెట్టి

తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా వస్తుందని ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా రానున్న మూడో సినిమా 'మహాకాళి'. ఫీమేల్ సూపర్ హీరో చిత్రంగా ముస్తాబవుతోంది. దీనికి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ చిత్రంలో మహాకాళిగా కన్నడ నటి భూమి శెట్టి నటించనున్నట్లు తెలిపారు. 'విశ్వంలోనే అత్యంత శక్తిమంతమైన సూపర్ హీరోలు రానున్నారు' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. భూమి శెట్టి ఇటీవల 'కింగ్డమ్'లో కనిపించిన విషయం తెలిసిందే. అందులో సత్యదేవ్ భార్యగా ఆమె అలరించారు. ఇక 'మహాకాళి' షూటింగ్ ఇప్పటికే 50 శాతం పూర్తయినట్లు సమాచారం . ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా (ం÷ఖబరజా। ఐరజీనినిజీ) శుక్రాచార్యుడిగా నటిస్తున్నారు. గతంలో ఈ సినిమా గురించి ప్రశాంత్ వర్మ (ఖసజీబజీనిబిర ÷ఎజీసపజీ) మాట్లాడుతూ.. మా యూనివర్స్‌కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించనున్నాం అని అన్నారు. ఈ యూనివర్స్‌లో భాగంగా ఇటీవల 'అధీర'ను ప్రకటించారు. ఎస్‌జే సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సూపర్ హీరో ఫిల్మ్‌కు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించనున్నారు.



## మాస్ జాతరకు తిరుగులేదు

### నటుడు రాజేంద్ర ప్రసాద్ వ్యాఖ్యలు వైరల్




రవితేజ నటించిన మాస్ జాతర సినిమాలో నటుడు రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్ర పోషించారు. అయితే ఆ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమంలో సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ తాజా వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రవితేజ హీరోగా నటిస్తున్న 'మాస్ జాతర' సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో అన్ని మసాలాలు సరిగ్గా కలిసిన మాస్ సినిమా రాలేదు. ఆ లోటును తీర్చేది ఈ మాస్ జాతర అని విశ్వాసంగా తెలిపారు. అంతేకాకుండా, ప్రేక్షకులు థియేటర్‌లో ఈ సినిమాను చూస్తే ఖచ్చితంగా ఆనందంతో తేలిపోతారని అన్నారు. తన మాటలతో అందరినీ ఆశ్చర్యపరుస్తూ, ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోకపోతే నేను సినిమాల నుంచి తప్పుకుంటాను అని రాజేంద్ర ప్రసాద్ ఘాటుగా వ్యాఖ్యానించారు. తన కెరీర్‌లో ఎందరో తారలతో కలిసి పనిచేసినప్పటికీ, రవితేజతో ఇదే తన మొదటి కాంబినేషన్ అని చెప్పారు. రవితేజతో కలిసి పనిచేయడం ప్రత్యేక అనుభూతిగా ఉంది. మాస్ జాతర అనే అద్భుతమైన సినిమాను చేయడానికి ఇంత సమయం పట్టింది. దర్శకుడు భాను అద్భుతంగా తెరకెక్కించారు. నా పాత్ర గురించి ఇప్పుడే చెబితే థ్రిల్ పోతుంది , థియేటర్‌లో చూసి ఆనందించండని అన్నారు.

## నా నటనకు రిటైర్మెంట్ లేదు

### మాస్ జాతర హీరో రవితేజ

'మాస్ జాతర' అంటూ ఆడియన్స్‌ను అలరించడానికి సిద్ధమయ్యారు హీరో రవితేజ. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో రవితేజ ప్రచారం జోరు పెంచారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు. నటనకు రిటైర్మెంట్ తీసుకోను. నా చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటాను. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. అందుకే అవి నన్ను ప్రభావితం చేయవని రవితేజ తెలిపారు.ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. దీని చిత్రీకరణలో నాకు కొన్ని గాయాలు అయ్యాయి. వాటి కారణంగానే చాలాసార్లు వాయిదా పడింది. సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నాం, తర్వాత వేసవిలో రావాలనుకున్నాం, వినాయక చవితికి రిలీజ్ చేద్దాం అనుకున్నాం.. ఆ తేదీలేవీ కుదర్లేదు. ఇన్ని రోజులకు విడుదల చేస్తున్నాం. ఇదే సరైన సమయమని అనుకుంటున్నా. ఏది జరిగినా మన మంచికే. నా కెరీర్‌లో సినిమా ప్రారంభించిన తర్వాత ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు. మొదటిసారి ఇలా జరిగిందన్నారు. జయాపజయాలను నేను పట్టించుకోను. నా పని చేస్తూ వెళ్తాను. ఎవరికైనా నేను ఇచ్చే సలహా ఇదే. మన పనిని వందశాతం కష్టపడి చేస్తూ వెళ్తే ఏదో ఒకరోజు దానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతాను. ఆత్మవిశ్వాసం తగ్గిపోతే ఏదీ సాధించలేరు. అన్నిటికంటే మనపై మనకు నమ్మకం ముఖ్యం.





## రాజమౌళి-మహేశ్‌బాబు కాంబో

### కొత్త సినిమా విశేషాలు పంచుకోనున్న రాజమౌళి

రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ఒక సినిమా రూపొందుతోంది. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాని 'ఎస్ఎస్ఎంబి 29' అని, గ్లోబ్ ట్రాట్టింగ్ మూవీ అని రకరకాలుగా పిలుస్తున్నారు. అయితే ఈ సినిమాకి సంబంధించిన పూజా కార్యక్రమం చాలా సీక్రెట్‌గా జరిపించారు రాజమౌళి. హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో వేసిన సెట్లో చాలా సీక్రెట్‌గా, పగడ్బందీగా ఓపెనింగ్ జరిపి, ఆ రోజు నుంచే కొన్నాళ్లపాటు షూటింగ్ కూడా జరిపారు. ఇటీవలే ఒక షెడ్యూల్ షూటింగ్ కోసం కెన్యా కూడా వెళ్లి వచ్చింది టీమ్. ఇప్పుడు ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, నవంబర్ 15వ తేదీన హైదరాబాద్ వేదికగా ఈ సినిమాకి సంబంధించి ఒక పెద్ద ఈవెంట్ నిర్వహిస్తున్నారు రాజమౌళి. కే.ఎల్. నారాయణ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఈవెంట్‌లో సినిమాకి సంబంధించిన అనేక విషయాలను వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా రాజమౌళి తన సినిమాలు మొదలుపెట్టేముందు ఒక ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, సినిమా ఎలా ఉంటుందో ముందే చెప్పేస్తారు. కానీ ఈ సినిమా విషయంలో మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నారు. అయితే ఇప్పుడు ఈవెంట్ నిర్వహించడానికి కారణం ఏంటి అనేది మాత్రం తెలియదు. నవంబర్ 15వ తేదీ జరగాల్సిన ఈవెంట్‌కు సంబంధించి ఇప్పటినుంచే ఏర్పాట్లు ప్రారంభమైనట్లుగా సమాచారం

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com